ఆదివారం
18-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 58
పేజీలు : 6+8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

స్కైయింగ్ జంప్‌తో గిన్నిస్‌కెక్కిన పర్వతారోహకుడు

లండన్: బ్రిటన్‌కు చెందిన పర్వతారోహకుడు జాషువా బ్రెగ్‌మెన్ (34) 18,753 అడుగుల ఎత్తైన కొండపై నుంచి స్కైయింగ్ జంప్ చేసి గిన్నిస్ ప్రపంచ రికార్డు నమోదు చేశారు. ఫ్రెంచ్ పర్వతారోహకుడు మాథియాస్ గిరార్డ్ 2019లో 14,301 అడుగుల ఎత్తైన పర్వతం నుంచి స్కైయింగ్ జంప్ చేశాడు. ఆ రికార్డును జాషువా బద్దలు కొట్టారు. స్కీయి-బేస్ జంపింగ్ క్రీడలో.. స్కైయింగ్‌తో పాటు బేస్ జంపింగ్ ఉంటుంది. హిమాలయ పర్వతాలపై స్కైయింగ్ చేసిన జాషువా.. సుమారు రెండు వారాల పాటు సాధన చేసి ఈ రికార్డును సాధించగలిగారు. మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించే ఉద్దేశంతో జాషువా ఈ సాహసం చేసినట్లు సమాచారం

విలియమ్స్‌కు మందగించిన చూపు

వాషింగ్టన్: ప్రముఖ వ్యోమగామి సునీత విలియమ్స్ అంతరిక్షంలో చిక్కుకుపోయారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు వ్యోమగామి బారీ విల్మోరేతో కలిసి వెళ్లిన విలియమ్స్ తిరిగి భూమి మీదకు ఎప్పుడు చేరుతారన్నది అస్పష్టంగా ఉంది. ఇద్దరు వ్యోమగాముల సురక్షిత ప్రయాణానికి బోయింగ్/నాసా కసరత్తు కొనసాగుతోంది. స్టార్‌లైనర్‌లో అనేక సమస్యలు ఉన్నందున స్పేస్ ఎక్స్ క్రూ డ్రాగన్ ద్వారా వీరిద్దరిని భూమికి చేర్చాలని ప్రయత్నిస్తున్నారు. ఇతర ప్రత్యామ్నాయాలనూ

- మిగతా 2 లో

గాజాలో ముగిసిన ఇజ్రాయిల్ పోరు!

జెరుసలేం: హమాస్ అంతమే లక్ష్యంగా గాజా స్ట్రిప్‌లో పది నెలలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులు ముగిశాయని వార్తలు వస్తున్నాయి. 'పోరు ముగిసింది. ఇక ఇజ్రాయిలీలు తిరిగి వెళ్లవచ్చు. కొత్తగా ఇంటెలిజెన్స్ సమాచారం ఉంటే మళ్లీ గాజాకు రావచ్చు. ఇప్పటికి మాత్రం పలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ సైనిక కార్యకలాపాలు ముగిశాయి' అని సీనియర్ భద్రతాధికారులు తెలిపినట్లు ఇజ్రాయిల్‌కు చెందిన

- మిగతా 2 లో

కమిటీ వేస్తాం... సమ్మె విరమించండి
కేంద్రం

న్యూఢిల్లీ: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచారానికి నిరసనగా దేశవ్యాప్త నిరసన చేపడుతున్న వైద్యులు తక్షణమే సమ్మె నిలిపివేయాలని కేంద్రం విజ్ఞప్తి చేసింది. వైద్యుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ శనివారం ప్రకటన చేసింది. దేశంలో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్న వేళ ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే విధుల్లో చేరాలని విజ్ఞప్తి చేసింది. జూనియర్

- మిగతా 2 లో

ఇబ్బందుల్లో ఉన్నాం...

ఆదుకోండి... మోదీకి చంద్రబాబు విజ్ఞప్తి

పోలవరం, అమరావతి, ఆర్థిక అంశాలపై చర్చ

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ సంప్రదింపులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అప్పులభారంతో సతమతమవుతున్న రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ప్రధాని నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజ్ఞప్తి చేశారు. కేంద్రబడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత మోదీని చంద్రబాబు కలవడం ఇదే మొదటిసారి. ఆర్థిక సవాళ్లను అధిగమించడానికి, ఆర్థిక కార్యకలాపాలు మెరుగుదలకు, రాష్ట్ర జీడీపీ పెంపుదలకు కేంద్ర సాయం మరింత అవసరమని చంద్రబాబు కోరారు. చంద్రబాబు నాయుడు శనివారం ఢిల్లీలో బిజీబిజీగా గడిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం సాయంత్రానికి ఢిల్లీ చేరుకున్న చంద్రబాబు తొలుత కేంద్ర జలవనరుల శాఖ మంత్రి పాటిల్‌ను కలిసి... పోలవరం ప్రాజెక్టు నిధులపై చర్చించారు. ప్రాజెక్టు ప్రాధాన్యతను ఆయనకు మరోసారి వివరించి నిధుల విడుదలలో జాప్యం చేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రధాని నరేంద్రమోదీతో గంటకు పైగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం పూర్తిగా

సహకరిస్తానని చేసిన ప్రకటన, ఆర్థిక సాయంపై చంద్రబాబు ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర పరిస్థితులను వివరించారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసం తీవ్ర ఆందోళనకరంగా ఉన్నట్లు తెలియజేశారు. రుణాలు రీషెడ్యూలు చేయాలని, కేంద్రం అండగా ఉంటే తప్ప గట్టెక్కలేమని రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను వివరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును భరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలో ఆయా నిధుల మంజూరుపై ప్రధానితో మాట్లాడినట్లు సమాచారం. అలాగే రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం చేయనున్నట్లు బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొనగా, ఆ నిధుల విడుదలకు అనుసరించాల్సిన నిబంధనలపైనా ప్రస్తావించినట్లు తెలిసింది. అంతేకాకుండా వెనకబడిన జిల్లాల జాబితాలో ఉన్న 8 జిల్లాలకు ఆర్థికసాయం కింద నిధులు విడుదల చేయాలని ప్రధాని మోదీని చంద్రబాబు కోరినట్లు తెలిసింది. అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. పెండింగ్ విభజన అంశాలతో పాటు ఆర్థిక అంశాలపై మంత్రితో చర్చించారు. ఈ పర్యటనలో సీఎం వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మ, ఎంపీలు లావు కృష్ణదేవరాయలు, సీఎం రమేశ్, కంభంపాటి రామమోహనరావు తదితరులు ఉన్నారు.

ఏపీలో 14 విమానాశ్రయాలు లక్ష్యం

కొత్తగా మరో 7 ఏర్పాటుకు సన్నాహాలు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న ఏడు విమానాశ్రయాలను 14కు విస్తరించాలనేదే తన లక్ష్యమని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

2లో



సిద్ధరామయ్యకు ముడా ఉచ్చు

- కర్నాటక ముఖ్యమంత్రిపై విచారణకు గవర్నర్ అనుమతి
- రాజ్యాంగవిరుద్ధ చర్య: సీఎం
- రాజకీయ అస్థిరతకు కుట్ర: ఖర్గే
- కోర్టుకెళతాం: డీకే

బెంగళూరు: కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు 'ముడా' ఉచ్చు బిగుసుకుంటోంది. ఇప్పటికే మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (ముడా) కుంభకోణం రాష్ట్ర రాజకీయాలను కుదిపివేస్తోంది. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య విచారణ (ప్రాసిక్యూషన్)కు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాత్ తాజాగా అనుమతి ఇవ్వడం రాజకీయంగా దుమారం రేగింది. దీంతో సిద్ద అరెస్టుకావచ్చన్న చర్చ మొదలైంది. బెంగళూరుకు చెందిన సామాజిక కార్యకర్తలు ప్రదీప్ కుమార్, టీజే అబ్రహాం, మైసూరుకు చెందిన స్నేహమయి కృష్ణ పెట్టిన పిటిషన్ల ఆధారంగా సిద్దరామయ్య విచారణకు అనుమతులు ఇస్తూ గవర్నర్ సెక్రటేరియట్ నుంచి ఆరు పేజీల లేఖ ప్రధాన కార్యదర్శి షాలిని రజనీశ్‌కు శనివారం అందింది. ముడా కుంభకోణంలో సిద్దరామయ్య భార్య పార్వతి ప్రధాన నిందితురాలు. మైసూరులో అక్రమంగా భూములు సేకరించారని సీఎం దంపతులపై ఆరోపణలు ఉన్నాయి. తాజా పరిణామాణంతో ముఖ్యమంత్రిపై కేసు నమోదు కానుంది. తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న ఉత్కంఠ నెలకొంది. ఇటీవల సీఎంకు గవర్నర్ నుంచి షోకాజ్ జారీ అయింది. గవర్నర్ ఆదేశాలను కోర్టులో సవాల్ చేస్తామని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. కాంగ్రెస్ అధిష్టానం, కర్నాటక ప్రజలు సిద్దరామయ్య వెన్నంటే ఉండగా, ఈ కేసును చట్టబద్ధంగా ఎదుర్కొంటామన్నారు. గవర్నర్ ఆదేశాలు వెలువడిన వెంటనే డీకే శివకుమార్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. బీసీ అయినందునే సిద్దను గద్దె దించాలని చూస్తున్నారన్నారు. గవర్నర్ తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పిటిషన్‌ను తిరస్కరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగబోమని, సిద్దరామయ్య రాజీనామా చేసే ప్రసక్తే లేదని డీకే శివ కుమార్ తేల్చిచెప్పారు. తనపై, తన భార్యపై ఆరోపణలను సిద్దరామయ్య తోసిపుచ్చారు. న్యాయమైన పరిహారం

- మిగతా 2 లో

నిరసనాగ్రహం

- ఆర్‌జీ కర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా వైద్య సేవలు బంద్
- వైద్యుల భారీ ప్రదర్శనలు, మానవహారాలు
- మూతపడ్డ ఆసుపత్రులతో రోగుల ఇక్కట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రి వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఆసుపత్రుల్లో పూర్తిగా వైద్య సేవలు నిలిపివేశారు. వైద్యులు భారీ ప్రదర్శనలు, ర్యాలీలు చేపట్టారు. దోషులను కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, వైద్యులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని నినదించారు. వైద్యుల ఆందోళనలకు వివిధ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సంఘీభావం తెలిపాయి. అన్ని ప్రభుత్వ ప్రైవేటు వైద్యశాలలు మూతపడ్డాయి. సాధారణ చికిత్సలు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. కేవలం అత్యవసర కేసులు మాత్రమే వైద్యులు చూశారు. విజయవాడలో ఐఎంఏ హాలు వద్ద నుంచి ఏలూరు రోడ్డు మీదుగా రామవరప్పాడు రింగ్ వరకు వైద్యులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీలో ఐఎంఏ అసోసియేషన్ నేతలు డాక్టర్ జయచంద్ర, డాక్టర్ పోలవరపు ఫణీందర్, డాక్టర్ ఎం.రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు.

భారత జాతికి తలవంపులు తెచ్చే ఘటన : ముప్పాళ్ల నాగేశ్వరరావు

కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం యావత్ భారత జాతికి తలవంపులు తెచ్చే విషాద ఘటన అని, ఇటువంటివి పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తీసుకురావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న మహిళా వైద్యురాలిపై అమానుషంగా, సామూహికంగా అత్యాచారం చేసి, పాశవికంగా హత్య చేసిన కేసుపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో జూనియర్ వైద్యులు న్యాయపోరాట దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించి ఇండియన్ మెడికల్ కౌన్సిల్ (ఐఎంఏ) ఈ నెల 17 నుంచి 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేతకు ఇచ్చిన పిలుపునకు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఒంగోలులోని రిమ్స్ హాస్పిటల్ జూనియర్ డాక్టర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. రిమ్స్ హాస్పిటల్ నుంచి ఒంగోలు చర్చి సెంటర్ వరకు వైద్య విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చి సెంటర్‌లో మానవహారం నిర్మించి తన నిరసన తెలియజేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కపిలేశ్వరపురం పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్వర్యాన నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మంగళగిరి ఎయిమ్స్‌లో ఆవరణలో డాక్టర్లు, నర్సులు, వైద్య విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా సమితి కార్యదర్శి మన్నవ యామిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దోషులను శిక్షించాలని

- మిగతా 2 లో

హత్యాచారం అమానుషం

నల్లని వస్త్రాలతో వైద్యుల నిరసనకు రామకృష్ణ సంఘీభావం

విశాలాంధ్ర-విజయవాడ: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన అమానుషమని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడికి కఠినశిక్ష విధించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైద్యురాలిపై అఘాయిత్యాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు, వైద్య సిబ్బంది 24 గంటల నిరసన చేపట్టడం అభినందనీయమన్నారు. సీపీఐ తరపున ఈ నిరసనకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. వైద్యుల

- మిగతా 2 లో

ఇదీ లోకం!

హలో సార్..భూ కబ్జాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి, ఇవన్నీ రాజధానికి పంపాలంటే కొన్ని లారీలు కావాలి, పంపండి!

రాష్ట్ర కేబినెట్ 28కి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ మంత్రి మండలి సమావేశం ఈ నెల 27వ తేదీకి బదులు 28వ తేదీకి వాయిదా పడింది. ఈ నెల 27వ తేదీ ఉదయం కేబినెట్ భేటీ జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 28న ఉదయం 11 గంటలకు వెలగపూడి సచివాలయంలోని కేబినెట్ మీటింగ్ హాలులో మంత్రి మండలి సమావేశం జరుగుతుందని సీఎస్ శనివారం మళ్లీ ఉత్తర్వులు విడుదల చేశారు. తొలుత కాగిత రహిత కేబినెట్ (ఈ క్యాబినెట్) సమావేశం

- మిగతా 2 లో

ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి ప్రభుత్వం శనివారం మార్గదర్శకాలను విడుదల చేసింది. 12 శాఖల్లో బదిలీలకు ఆమోదం తెలిపింది. ఈ నెల 19 నుంచి 31 వరకూ ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, గ్రామ, వార్డు సచివాలయాలు, గనులు, పౌర సరఫరాలు, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఇంజినీరింగ్ ఉద్యోగులు, దేవదాయ, అటవీ, రవాణా, పరిశ్రమలు, విద్యుత్, వాణిజ్య పన్నులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖల్లోని ఉద్యోగుల బదిలీలకు అనుమతి ఇచ్చింది. ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది బదిలీలకు దూరంగా ఉన్నారు. ప్రజా సంబంధిత సేవల్లో ఉండే శాఖల్లో మాత్రమే బదిలీలకు అనుమతించినట్లు పేర్కొంది. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది. ఎక్సైజ్ శాఖలో బదిలీలకు సెప్టెంబరు ఐదో తేదీ నుంచి 15వ తేదీ వరకూ అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

వైసీపీకి 'ఆళ్ల' బైబై

- ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా
- వ్యక్తిగత కారణాలతో పార్టీకి దూరమని వెల్లడి

2లో

వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని... పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు.

'పోలవరం' ఫైళ్లు దగ్ధం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్: రెవెన్యూ ఫైళ్ల దహనాన్ని మరువకముందే పోలవరం ఫైళ్లు దగ్ధమవ్వడం ఆంధ్రప్రదేశ్‌లో కలకలం రేపింది. పోలవరం ఎడమ ప్రధాన కాల్వకు సంబంధించిన ఫైళ్లు దగ్ధమయ్యాయి. ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు పరిపాలనా కార్యాలయంలోని అధికారులే ఈ పని చేశారన్న అనుమానమున్నది. భూసేకరణకు సంబంధించి లబ్ధిదారులకు పరిహారం విషయంలో అక్రమాలు బయటకు వస్తాయనే ఫైళ్లను దహనం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అక్కడ సగం కాలి పడివున్న ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. అవి పోలవరం

నిర్వాసితులకు పరిహారానికి సంబంధించిన ఫైళ్లుగా గుర్తించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం తక్షణమే విచారణకు ఆదేశాలిచ్చింది. దీంతో రంగంలోకి దిగిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వేదవల్లి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అక్కడి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అదే క్రమంలో కార్యాలయ సిబ్బందిని అధికారులు విచారించారు. పోలీసులు కూడా దర్యాప్తు చేపట్టారు.

కమలా హారిస్‌తో డిబేట్
ట్రంప్‌కు సాయంగా తులసి

వాషింగ్టంన్: అమెరికా అధ్యక్ష అభ్యర్థులుగా ఖరారైన డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ త్వరలోనే ముఖాముఖి ఎదురుపడనున్నారు. వచ్చే నెలలో వీరిద్దరూ తొలి డిబేట్‌లో పాల్గొననున్నారు. ఈ సంవాదానికి సిద్ధమవుతున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్... హారిస్‌ను ఎదుర్కొనేందుకు డెమొక్రటిక్ పార్టీ మాజీ నాయకురాలు, భారత సంతతి నేత తులసీ గబ్బర్డ్ సాయం తీసుకుంటున్నారు. డిబేట్ కోసం ప్రాక్టీస్ సెషన్‌లో ట్రంప్‌నకు ఆమె సాయం చేస్తున్నారు. ఈ మేరకు న్యూయార్క్ టైమ్స్ ఓ కథనం వెలువరించింది. ఫ్లోరిడాలోని మారే లాగోలో గల తన ప్రైవేట్ క్లబ్‌లో ట్రంప్ ప్రాక్టీస్ సెషన్ తీసుకుంటున్నారు. ఇందులో తులసీ కూడా పాల్గొన్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని ట్రంప్ అధికార ప్రతినిధి కరోలిన్ లియావిట్ ధ్రువీకరించినట్లు ఆ కథనం వెల్లడించింది. 'జో బైడెన్‌తో జరిగిన చర్చతోనే రాజకీయ చరిత్రలో ఉత్తమ డిబేటర్‌గా ట్రంప్ తనను తాను నిరూపించుకున్నారు. సంవాదాలకు ప్రత్యేకంగా సన్నద్ధమవ్వాల్సిన అవసరం ఆయనకు లేదు. కాకపోతే ఆయన ఈసారి ఓ మహిళను ఎదుర్కోబోతున్నారు. విధానపరమైన విషయాలతో పాటు మరిన్ని అంశాలపై ఆయన దృష్టిపెడుతున్నారు. ఈ క్రమంలోనే తులసీ గబ్బర్డ్ లాంటి నేతలతో ఆయన సమావేశమవుతున్నారు' అని కరోలిన్ చెప్పినట్లు ఆ కథనం పేర్కొంది. డెమొక్రటిక్ పార్టీ తరఫున కాంగ్రెస్ సభ్యురాలిగా పనిచేసిన తులసి... 2020 అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థిత్వ రేసులో పోటీపడ్డారు. నాడు ఇదే రేసులో కమలా హారిస్ కూడా ఉన్నారు. దీంతో 2019 జులైలో వీరిద్దరూ ప్రైమరీ డిబేట్‌లో పాల్గొన్నారు. ఆ సమయంలో హారిస్‌పై తులసీ తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ చర్చ జరిగిన కొన్ని రోజులకే హారిస్ రేసు నుంచి వైదొలిగారు. కొన్ని నెలల తర్వాత తులసీ కూడా వెనక్కి తగ్గారు. 2022లో ఆమె డెమొక్రటిక్ పార్టీని వీడారు. తాజా ఎన్నికల్లో ట్రంప్‌నకు మద్దతు ప్రకటించారు. ఒక దశలో ట్రంప్ రన్నింగ్ మేట్(ఉపాధ్యక్షురాలు) ఈమెనని ప్రచారం జరిగింది. నవంబరు అధ్యక్ష ఎన్నికలకు సిద్ధమవుతున్న ట్రంప్, కమలా హారిస్ సెప్టెంబరు 10న ఏబీసీ టీవీ ఛానల్ డిబేట్‌లో పాల్గొననున్నారు. ఈ అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ పాల్గొంటున్న రెండో డిబేట్ ఇది. అంతకుముందు జో బైడెన్‌తో సంవాదంలో పాల్గొనగా... అందులో అధ్యక్షుడిపై ఘాటు స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ డిబేట్ తర్వాతే బైడెన్‌పై సొంత పార్టీ నుంచి వ్యతిరేకత ఎదురవడంతో ఆయన అధ్యక్ష రేసు నుంచి వైదొలగాల్సి వచ్చింది.

సూడాన్‌లో రక్తపాతం

80 మంది అమాయకుల బలి

ఖార్టూమ్: సూడాన్‌లో పారామిలటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్(ఆర్ఎస్ఎఫ్) బలగాలు దాడికి పాల్పడ్డాయి. సెంట్రల్ సూడాన్‌లోని సిన్నర్‌లో కాల్పులు జరపడంతో దాదాపు 80 మంది ప్రాణాలు కోల్పోయారు. బాలికలను కిడ్నాప్ చేసేందుకు ఆర్ఎస్ఎఫ్ ప్రయత్నించగా... స్థానికులు అడ్డుకోవడంతో రక్తపాతం చోటుచేసుకుంది. అయితే, దీనిపై ఆర్ఎస్ఎఫ్ మాత్రం ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు. పారా మిలటరీ దాడిపై సిన్నర్ యువత తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. వారి ఆగడాలు ఎక్కువైపోయాయని విమర్శలు గుప్పించారు. 'గురువారం నుంచి ఆర్ఎస్ఎఫ్ బలగాలు మా ప్రాంతంపై గురిపెట్టాయి. సిన్నార్ స్టేట్‌లోని జలక్ని గ్రామాన్ని ముట్టడించిన ఐదు రోజుల తర్వాత దాడులకు తెగబడ్డాయి. ఓ బాలికను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించాయి. స్థానికులు తీవ్రంగా పోరాడి ప్రతిఘటించారు. దీంతో ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ కాల్పులకు ఉపక్రమించాయి. ఇందులో 80 మందికిపైగా మృతి చెందారు. చాలామంది గాయాలపాలయ్యారు' అని వెల్లడించారు. గత జూన్ నుంచి ఆర్ఎస్ఎఫ్ బలగాల నియంత్రణలోనే ఈ ప్రాంతం ఉంటోంది. దాదాపు 7.25 లక్షల మంది ఇప్పటివరకు వెళ్లిపోయినట్లు అంతర్జాతీయ మైగ్రేషన్ సంస్థ వెల్లడించింది. సుడానీస్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్, ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ మధ్య దాడుల వల్ల గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 16,650 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. కోటి మందికి పైగా సూడాన్‌ను వదిలివెళ్లినట్లు... 2 కోట్ల మందిని పక్క దేశాలు తిరస్కరించినట్లు ఐక్యరాజ్యసమితి గణాంకాలు చెబుతున్నాయి.

కమిటీ వేస్తాం... సమ్మె విరమించండి

(మొదటిపేజీ తరువాయి)

వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా భారత వైద్య సంఘం (ఐఎంఏ) సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అత్యవసరం కాని వైద్య సేవలను 24 గంటల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ఆస్పత్రులలో ఓపీ సేవలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో కమిటీ ఏర్పాటు చేస్తామని వైద్యులకు కేంద్రం హామీ ఇచ్చింది. వైద్యవృత్తిలో ఉన్నవారి భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరింది.

సిద్దరామయ్యకు 'ముడా' ఉచ్చు

(మొదటిపేజీ తరువాయి)

పొందేందుకు తన భార్య అర్హురాలన్నారు. సీఎం పదవి నుంచి తప్పించి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేయాని కుట్రలు జరుగుతున్నట్లు ఆరోపించారు. తనపై చర్యలు చట్ట వ్యతిరేకం, రాజ్యాంగ విరుద్ధమైనవిగా సిద్ద వెల్లడించారు. న్యాయపోరటం చేస్తానని, పదవి నుంచి తప్పుకునేదిలేదని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేతుల్లో తోలుబొమ్మలా గవర్నర్ ఉన్నారని సిద్దూ వ్యాఖ్యానించారు.

పార్టీ అధిష్ఠానం, రాష్ట్ర మంత్రులు, ఎంపీల మద్దతు తనకున్నదన్నారు. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, మాజీ మంత్రులు శశికళ జొల్లే, ముర్గేశ్ నిరానీ వ్యవహారాల్లో వారి విచారణకు ఇప్పటివరకు ఆమోదం తెలపకపోవడానికి కారణమేమిటని రాజ్‌భవన్‌ను సిద్ధరామయ్య ప్రశ్నించారు. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం కూడా ఈ పరిణామాన్ని ఖండించింది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు రాజ్‌భవన్‌ను బీజేపీ దుర్వినియోగిస్తోందని దుయ్యబట్టింది. బీజేపీయేతర పార్టీల పాలిత రాష్ట్రాల్లో బీజేపీ నియమిత గవర్నర్లు సమస్యలు సృష్టిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే విమర్శించారు. కర్నాటక ముఖ్యమంత్రిని విచారించేందుకు గవర్నర్ అనుమతికి గల కారణాలను తెలుసుకున్న తర్వాతే దీనిపై స్పందించగలనని బెంగళూరు విలేకరులతో ఆయనన్నారు. కేసు పూర్తి వివరాలు తెలుకొని, న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతామని ఖడ్గే చెప్పారు.

వైసీపీకి 'ఆళ్ల' బైబై

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని... పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఎవరూ ఊహించిన విధంగా రాజీనామా సమర్పించడం ఏలూరు జిల్లా లో తీవ్ర చర్చనీయాంశమైంది. తన వ్యక్తిగత కారణాలవల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నానని వెల్లడించారు. ఏలూరులోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాని మాట్లాడారు. కొద్దిరోజుల క్రితం ఏలూరు జిల్లా అధ్యక్ష పదవికి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవికి రాజీనామా చేసినట్లు వివరించారు. తన వ్యక్తిగత కారణాల దృష్ట్యా ప్రాథమిక సభ్యత్వానికి సైతం రాజీనామా చేసినట్టు చెప్పారు. ఇకనుంచి తాను ఓ సాధారణ వ్యక్తిగా ప్రజలకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయం కూలదోస్తున్నారనే ప్రచారం అవాస్తవమన్నారు. స్థల యజమాని రవిచంద్ర తన స్నేహితుడిని, ఆయన అమెరికాలో నివాసం ఉంటున్నట్లు చెప్పారు. గతంలో తనపై ఉన్న గౌరవంతో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకోవడానికి స్థలాన్ని లీజుకు ఇచ్చినట్టు తెలిపారు. అయితే స్థలం అభివృద్ధి కోసం 2024 ఎన్నికలకు ముందు ఆ స్థలాన్ని తిరిగి అప్పగించాలని రవిచంద్ర తనను కోరడంతో ఇదే విషయాన్ని పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ మిథున్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. ఆ స్థలాన్ని యజమానికి అప్పగించమని తనకు ఆయన చెప్పారని వివరించారు. పార్టీ అధికారిక మేనేజర్ ద్వారా కేంద్ర కార్యాలయానికి ... యజమానికి స్థలం అప్పగిస్తున్నట్లు సమాచారం అందించి ఈ నెల ఒకటో తేదీన అప్పగించినట్టు పేర్కొన్నారు. ఈ విషయంలో ఎటువంటి అపోహలకు తావు లేదని స్పష్టం చేశారు. రెండు శతాబ్దాలుగా ఏలూరు ప్రజలు తనను ఎంతగానో ఆదరించారని, వీరందరికీ రుణపడి ఉంటారని ఆళ్ల చెప్పారు. కాగా, ఏలూరు జిల్లాలో కీలక నేతగా వైసీపీని నడిపిస్తున్న ఆళ్ల నాని తన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయడం హాట్ టాపిక్ గా మారింది. ఇకనుంచి బాధ్యతలు ఎవరు చేపడతారనే దానిపై సర్వత్ర చర్చనీయాంశమైంది. సీనియర్ నేత పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గానీ, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరావుకు గాని అప్పగించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

గాజాలో ముగిసిన ఇజ్రాయిల్ పోరు!

(మొదటిపేజీ తరువాయి)

కాన్ టీవీ న్యూస్ పేర్కొంది. హమాస్ రఫా బ్రిగేడ్‌ను తుడిచిపెట్టినట్లు అధికారులకు ఇజ్రాయిల్ సైన్యం తెలిపిందని వార్తా నివేదిక వెల్లడించింది. కొద్ది రోజులుగా జరుగుతున్న రాజకీయ స్థాయి చర్చల్లో భద్రతా పరిస్థితుల సమీక్షలో భాగంగా ఈ మేరకు తెలిసిందని పేర్కొంది. హమాస్ స్థావరాలు నిర్వీర్యమైనందున బందీల విడుదలకు ఒప్పందానికి ఇదే సమయమని రాజకీయ వర్గాలకు ఇజ్రాయిల్ సీనియర్ రక్షణాధికారులు తెలిపినట్లు కాన్ టీవీ వెల్లడించింది. గాజాలో కాల్పుల విరమణ కోసం చర్చలు కూడా ముగిశాయని తెలుస్తోంది. ఇరాన్ దాడి చేస్తుందన్న భయంతో చర్చల్లో పాల్గొనేందుకు వచ్చిన ఇజ్రాయిలీ బృందం ఖతార్‌కు వాయుమార్గంలో చేరుకోలేదని, తొలుత అబుదాబీ, యూఏఈకి వచ్చి అక్కడ నుంచి దోహా వెళ్లిందని వార్తా సంస్థ తెలిపింది. అయితే ఇజ్రాయిల్ బృందం విమానంలో మాత్రం ప్రయాణించలేదని పేర్కొంది. 'కాల్పుల విరమణ, బందీల విడుదల కోసం ఒప్పందం ఖరారు చేసేందుకు మధ్యవర్తులుగా సీనియర్ అధికారులు దోహాలో రెండు రోజుల పాటు విస్తృత స్థాయి చర్చలు జరిపినట్లు అమెరికా, ఈజిప్ట, ఖతార్ సంయుక్త ప్రకటన తెలిపింది. రెండు వర్గాల ముందర తమ ప్రతిపాదనను ఉంచినట్లు పేర్కొంది. తదుపరి కార్యాచరణపై సమాలోచనలు జరపాల్సి ఉన్నదని వెల్లడించింది.

ఏపీలో 14 విమానాశ్రయాలు లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న ఏడు విమానాశ్రయాలను 14కు విస్తరించాలనేదే తన లక్ష్యమని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబుతో రాజమహేంద్రవరం, విజయవాడ, కడప విమానాశ్రయాల్లో టెర్మినల్ సామర్థ్యం పెంపు పనులపై శనివారం సమీక్ష చేసిన అనంతరం రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. శ్రీకాకుళం, దగదర్తి, కుప్పం, నాగార్జున సాగర్‌లో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు స్థలాలు గుర్తించినట్టు తెలిపారు. ఈ విషయంలో విమానయాన శాఖ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి ముందుకు వెళతాయన్నారు. విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కొత్త ప్రాంతాల్లో భూమి, సాంకేతిక అంశాలు పరిశీలిస్తామన్నారు. పుట్టపర్తి విమానాశ్రయాన్ని ప్రభుత్వ సంస్థగా మార్చేందుకు సీఎంతో చర్చించినట్టు తెలిపారు. ప్రైవేటు విమానాశ్రయ నిర్వాహకులతో చర్చించాల్సి ఉందన్నారు. పౌరవిమానయాన సంస్థగా మారిస్తే సాధారణ కార్యకలాపాలు సాగించవచ్చన్నారు. ఏపీని లాజిస్టిక్ హబ్‌గా చేయాలనేది చంద్రబాబు ఆలోచన అని, లాజిస్టిక్ హబ్‌గా చేయడంలో విమానాశ్రయాల పాత్ర కీలకమన్నారు. ఏపీలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం భూమిని గుర్తిస్తే అనుమతులు మంజూరుకు తమ శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి తెలిపారు.

'పోస్టుమార్టం' వార్తలన్నీ అసత్యాలే

కోల్‌కతా పోలీసు అధికారి వెల్లడి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అవన్నీ ప్రజలను ఎంతో ఆందోళనకు, వారి ఆగ్రహానికి గురయ్యేలా చేశాయి. అయితే ఆ విస్తుగొలిపే విషయాలు నిజం కాదని కోల్‌కతా పోలీసులు తోసిపుచ్చారు. జూనియర్ వైద్యురాలి పోస్టుమార్టం ప్రక్రియ మొత్తం మేజిస్ట్రేట్ ఎదుట జరిగింది. దానిని మొత్తం వీడియో తీశారు. అందులో ఎక్కడా ఆమె శరీరంలో ఎముకలు విరిగినట్లు ప్రస్తావించలేదు. ఒక దశలో ఆమెపై సామూహిక అత్యాచారం జరిగిందన్న వార్తలు వచ్చాయి. ఆమె శరీరంలో 150 మిల్లీగ్రాముల వీర్యం ఉన్నట్లు పోస్టుమార్టంలో గుర్తించారని ప్రచారం జరిగింది. ఆమె తల్లిదండ్రులు కోర్టులో వేసిన పిటిషనే ఈ సమాచారానికి మూలమని కథనాలు వచ్చాయి. దీనిపై కోల్‌కతా పోలీస్ అధిపతి వినీశ్ గోయల్ మాట్లాడుతూ '150 ఎంజీ వీర్యం గుర్తించినట్లు కొందరు చెప్పారు. వారికి ఇలాంటి సమాచారం ఎక్కడ దొరుకుతుందో తెలియడం లేదు. ఇది మీడియాలో వివిధ రూపాల్లో చక్కర్లు కొడుతోంది. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకే ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని అసహనం వ్యక్తంచేశారు.

జూనియర్ వైద్యురాలి మృతి ఘటనను అసహజ మరణంగా నమోదు చేయడం అనుమానాలకు తావిస్తోందని కలకత్తా హైకోర్టు వ్యాఖ్యానించింది. ఆసుపత్రి యంత్రాంగం కేసు నమోదు చేయకపోవడాన్ని ప్రశ్నించింది. మృతి ఘటనలో ఎటువంటి ఫిర్యాదు అందనప్పుడు పోలీసులు దాన్ని తొలుత అసహజ మరణంగానే నమోదు చేస్తారు. ఎవరైనా ఫిర్యాదు చేసినా, పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగా అది హత్యా, ఆత్మహత్యా అనేది ప్రస్తావిస్తారు. అసహజ మరణంగా కేసు నమోదు చేయడంపైనా, విమర్శలు రావడంపైనా గోయల్ స్పందించారు. 'ఎలాంటి ఫిర్యాదు లేనప్పుడు అలా నమోదు చేయడం చాలా సహజం. అసహజ మరణంగా నమోదు చేయడం ద్వారా విషయాన్ని దాచిపెట్టి, ఆత్మహత్యగా చూపించాలని అనుకుంటున్నామని ఎందుకు చెబుతున్నారో' అర్థం కావడం లేదు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోన్న కొన్ని పోస్టులు సహచర వైద్యుల్ని అనుమానితులుగా పేర్కొన్నాయి. ఆమె తల్లిదండ్రులు కొన్ని పేర్లతో కూడిన జాబితాను సీబీఐకు ఇచ్చినట్లు పేర్కొన్నాయి. ఒక్క వలంటీర్ పేరు మినహా ఇప్పటివరకు ఏ దర్యాప్తు సంస్థ కూడా ఇతర అనుమానితుల పేర్లను రికార్డుల్లో నమోదు చేయలేదు. ఈ కేసులో పెద్ద వ్యక్తుల ప్రమేయం ఉందంటూ వచ్చిన వార్తలను తోసిపుచ్చారు.

విలియమ్స్‌కు మందగించిన చూపు

(మొదటిపేజీ తరువాయి)

అన్వేషిస్తున్నారు. ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల్లో మరో సమస్య ఎదురైంది. ఐఎస్ఎస్‌లో ఉన్న సునీత విలియమ్స్‌కు చూపు మందగించింది. దీంతో ఆమె ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మైక్రోగ్రావిటీ కారణంగా ఆరోగ్యపరమైన సమస్యలు వస్తున్నట్లు తెలుస్తోంది. స్పేస్‌ఫ్లైట్ అసోసియేటెడ్ న్యూరో ఆకులర్ సిండ్రోమ్ (ఎస్ఏఎన్ఎస్)తో విలియమ్స్ బాధపడుతున్నారు. ఈ సమస్య ఉంటే శరీరంలో ద్రవాల సరఫరా దెబ్బతిని చూపు మందగిస్తుంది. ఈ మేరకు విలియమ్స్ వైద్య పరీక్షలలో వెల్లడైంది. స్పేస్ ఎక్స్ క్రూ డ్రాగన్ మిషన్ సెప్టెంబరులో జరగబోతోంది. ఈ మిషన్ ద్వారా విలియమ్స్, విల్మోరే భూమికి చేరుకోగలుగుతారు. కేవలం ఎనిమిది రోజుల కోసం వెళ్లిన వీరు దాదాపు ఎనిమిది నెలలకుపైగానే అంతరిక్షంలో గడపాల్సి వచ్చింది. క్రూ డ్రాగన్ మిషన్ 2024 ఫిబ్రవరిలో భూమికి చేరుతుందన్న అంచనా ఉంది. అలాగే, స్పేస్ సూట్లు అనుకూలంగా లేకపోవడం కూడా నాసాకు పెద్ద సవాల్‌గా మారింది. బోయింగ్ స్టార్‌లైనర్ కోసం తయారు చేసిన స్పేస్‌సూట్లు... స్పేస్ ఎక్స్ క్రూ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌కు తగవు. డ్రాగర్ ద్వారా విలియమ్స్, విల్మోరేను తిరిగి తేవాలంటే వారు ఇప్పుడున్న స్పేస్ సూట్లకు బదులుగా మరింత భద్రతతో కూడిన సూటు ధరించాలి. ఈ సమస్య పరిష్కారానికి నాసా శ్రమిస్తోంది. క్రూ-9 డ్రాగన్ మిషన్ ద్వారా స్పేస్ఎక్స్ సూట్లు పంపాలని నాసా భావిస్తోంది.

200 సీట్లు గెలుపే లక్ష్యం: స్టాలిన్

చెన్నై: లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాల్లో విజయం సాధించిన విధంగానే 2026లో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో 200 స్థానాల్లో గెలిచేందుకు పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. తేనాంపేటలోని అన్నా అరివాలయం కలైంజర్ అరంగంలో డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం జరిగింది. స్టాలిన్ మాట్లాడుతూ 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 39 సీట్లలో గెలిచిన డీఎంకే కూటమి, 2024 ఎన్నికల్లో 40 స్థానాలను కైవశం చేసుకుందని, రాష్ట్రంలో వరుసగా లోక్‌సభ ఎన్నికల్లో రెండు సార్లు ఘనవిజయం సాధించిన పార్టీ ఏదీ లేదన్నారు. ఈ విజయానికి నేతలు, మంత్రులు, జిల్లా కార్యదర్శులు సమష్టి కృషి కారణమని ప్రశంసించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే 40కి 40 స్థానాలు గెలుచుకుంటామని ప్రకటించామని, ఆ విధంగానే రాబోయే శాసనసభ ఎన్నికల్లో 200 సీట్లు గెలుచుకుంటామని చెప్పారు. గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రజానీకం డీఎంకే ప్రభుత్వంపై చూపించే ఆదరాభిమానాలను పరిశీలించిన మీదటే 200 సీట్లు సునాయాసంగా గెలుచుకోవడం ఖాయమన్నారు. డీఎంకే ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాలపై ఇంటింటా ప్రచారం చేయాలని, ఏదో ఒక ప్రభుత్వ పథకం వల్ల ప్రతి ఇంటా ఓ వ్యక్తి ఖచ్చితంగా లబ్ధి పొంది ఉంటారని, ఈ విషయాన్ని కార్యకర్తలు, జిల్లా కార్యదర్శులు గుర్తుంచుకుని ప్రచారం చేయాలని కోరారు. విదేశీ పెట్టుబడుల కోసం తాను ఈ నెల 27న అమెరికా వెళ్తున్నానని, సమావేశంలో చేసిన తీర్మానం ప్రకారం డీఎంకే వజ్రోత్సవాల (త్రివిధ ఉత్సవాల) ఏర్పాట్లపై దృష్టిసారించాలని, తాను అమెరికాలో ఉన్నా, పార్టీ అధిష్టానవర్గం ద్వారా పనులను పరిశీలిస్తానని చెప్పారు. ఆదివారం జరిగే డీఎంకే మాజీ అధ్యక్షుడు కరుణానిధి వంద రూపాయల నాణెం ఆవిష్కరణ సభకు నాయకులు, ప్రముఖులు, కార్యకర్తలు హాజరుకావాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. డీఎంకే ఆవిర్భవించి 75 యేళ్లు పూర్తయ్యాయని, భారతదేశంలోనే తొలిసారిగా ఓ ప్రాంతీయ పార్టీ అధికారాన్ని కైవశం చేసుకున్న రాష్ట్రంగా పేరుగడించిందన్నారు.

2030కి అదనంగా 14.8 కోట్ల ఉద్యోగాలు: గీతా గోపీనాథ్

న్యూఢిల్లీ: జనాభా పెరుగుదల దృష్ట్యా 2030 నాటికి అదనంగా 14.8 కోట్ల ఉద్యోగాలు సృష్టించుకోవడం భారత్‌కు అవసరమని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) డిప్యూటీ ఎండీ గీతా గోపీనాథ్ అన్నారు. ఉపాధి కల్పనలో జీ20 దేశాల్లో భారత్ వెనకబడిందని తెలిపారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వజ్రోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ 2010 నుంచి ప్రతి దశాబ్దంలోనూ భారత్ సగటున 6.6శాతం వృద్ధి సాధించిందని అన్నారు. ఉపాధి రేటు 2శాతం కంటే తక్కువగా ఉందని, జీ20 దేశాలతో పోలిస్తే భారత్‌లో వెనుకబడిందని చెప్పారు. జనాభా పెరుగుదల దృష్ట్యా 2030 నాటికి ఆరు కోట్ల నుంచి 14.8 కోట్ల వరకు ఉద్యోగాలను అదనంగా సృష్టించుకోవాలని సూచించారు. 2024లో ఉన్నాం కాబట్టి ఇందుకు సమయం లేదని, సత్వర చర్యలు అవసరమని అన్నారు. భూ, కార్మిక సంస్కరణల అమలు అవసరాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ పెట్టుబడులు పెరిగినప్పటికీ ప్రైవేటు పెట్టుబడులు మెరుగుపడాలన్నారు. విద్యా వ్యవస్థను పునరుద్ధరిస్తే నైపుణ్యాలను పెంచుకోవచ్చని సూచించారు. వ్యాపార నిర్వహణ, నిబంధనలను మరింత సులభతరం చేయాలన్నారు. అలాగే పన్ను పరిధిని విస్తృతం చేస్తే ఆర్థిక వ్యవస్థ మరింత వేగవంతమవుతుందని గీతా గోపీనాథ్ అన్నారు.

నిరసనాగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేస్తూ ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్వర్యంలో జూనియర్ వైద్యులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. వీరికి ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఇతర ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా మన్నవ యామిని మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న వైద్యురాలిపై హత్యాచారం సభ్య సమాజం తలదించుకునేలా చేసిందని, దోషులను కఠినంగా శిక్షించడంతో పాటు వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. వైద్య సేవల బంద్‌తో రోగులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.

హత్యాచారం అమానుషం

(మొదటిపేజీ తరువాయి)

నిరసనకు సంఘీభావంగా కె.రామకృష్ణ నల్లని వస్త్రాలు ధరిం చారు. ప్రాణాలు పోసే వైద్యురాలిపై అత్యంత కిరాతకంగా దురా గతానికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రత్యేక చట్టం ద్వారా వైద్యులకు రక్షణ కల్పించాలని, నిందితుడికి కఠిన శిక్ష విధించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర కేబినెట్ 28కి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై కేబినెట్ సమావేశాలు ఎలక్ట్రానిక్ ఫార్మాట్‌లోనే జరుగుతాయని సీఎం చంద్రబాబు గత కేబినెట్‌లో మంత్రులకు తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన 28న జరిగే కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రధానంగా నూతన మద్యం పాలసీ, పోలవరం ప్రాజెక్టు పనులు, ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలక మార్పులు, సూపర్ సిక్స్ హామీల్లో ముఖ్యమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర కీలక అంశాలపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది.

చంపై సోరెన్ దారి ఎటు?

రాంచీ: అసెంబ్లీ పోరుకు జార్ఖండ్ సిద్ధమవుతున్న వేళ ఆ రాష్ట్ర మాజీ సీఎం చంపై సోరెన్ పార్టీ మారతారన్న ప్రచారం ఊపందుకుంది. జేఎంఎంకు గుడ్‌బై చెప్పి కమలం గూటికి చేరుతారన్న ప్రచారం సాగుతోంది. దీనిపై కొందరు విలేకరులు చంపై సోరెన్‌ను ప్రశ్నిస్తే అసలు తనపై ఎలాంటి ఊహాగానాలు ఉన్నాయో కూడా తెలియనదని, తెలియని విషయం వాస్తవమో కాదో ఎలా చెబుతానంటూ ఆయన ఎదురు ప్రశ్నించారు. 'ప్రస్తుత వదంతుల గురించి నాకు తెలియదు. అందకోసం అవి నిజమో కాదో చెప్పలేను. నేను ఎక్కడున్నానో అక్కడే ఉన్నా' అని చంపై సోరెన్ అన్నారు. హేమంత్ సోరెన్ అరెస్టు తర్వాత చంపై సోరెన్ ముఖ్యమంత్రి కావడం, ఆయన తిరిగి వచ్చిన తర్వాత రాజీనామా చేయడం తెలిసిందే. ఈ పరిణామాల దృష్ట్యా చంపై సోరెన్‌ను పొగుడుతూ బీజేపీ ఎంపీ దీపక్ ప్రకాశ్ ఇటీవల మాట్లాడారు. మంచి వ్యక్తిని కుర్చీ దింపేశారన్నారు. చంపై సోరెన్ తమ పార్టీలో చేరడంపై నిర్ణయం అధిష్ఠానానిదేనని దీపక్ అన్నారు. దీంతో చంపై బీజేపీలోకి వెళతారన్న ప్రచారం జోరందుకుంది కానీ చంపై ప్రస్తుత వైఖరితో ఆయన దారి ఎటు అన్న చర్చ మొదలైంది.

రాణాను భారత్‌కు అప్పగించొచ్చు
అమెరికా కోర్టు

వాషింగ్టన్: పాకిస్థాన్ సంతతికి చెందిన కెనడా వ్యాపారవేత్త తహవ్వుర్ హుస్సేన్ రాణాకు అమెరికా కోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. 2008 ముంబై ఉగ్రదాడితో సంబంధమున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయనను భారత్‌కు అప్పగించడంపై కాలిఫోర్నియాలోని కోర్టు సానుకూలంగా స్పందించింది. రాణాను భారత్‌కు అప్పగించేందుకు భారత్-అమెరికా అప్పగింత ఒప్పందం అనుమతి ఇస్తోందని యూఎస్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ ఫర్ ది నైన్త్ సర్క్యూట్ వెల్లడించింది. 26/11 ముంబై దాడుల్లో పాత్రధారిగా, ఉగ్రదాడి సూత్రధారుల్లో ఒకరైన లష్కరే తోయిబా ఉగ్రవాది డేవిడ్ కోలేమన్ హెడ్లీతో సంబంధమున్న వ్యక్తిగా రాణాపై ఆరోపణలు ఉన్నాయి. లాస్ ఏంజిల్స్‌లోని జైల్లో ఆయన ఉన్నారు. రాణాపై నేరాన్ని రుజువు చేసేందుకు సరిపడ సాక్ష్యాధారాలు భారత్ వద్ద లేవన్న రాణా తరఫు వాదనలను అమెరికా కోర్టు తిరస్కరించింది. ఆయనను భారత్‌కు అప్పగించవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొంది. 2008లో ముంబైలో జరిగిన ఉగ్ర దాడుల్లో ఆరుగురు అమెరికన్లతో సహా 166 మంది చనిపోయారు. 10 మంది ఉగ్రవాదులు 60 గంటల పాటు ముంబైలోని కీలక ప్రాంతాల్లో మారణహోమం సృష్టించారు.

20, 21 తేదీలలో తిరుపతిలో
ఏఐడీఆర్ఎం జాతీయ సమితి సమావేశాలు

విశాలాంధ్ర-విజయవాడ: ఈ నెల 20, 21 తేదీలలో ఆల్ ఇండియా దళిత్ రైట్స్ మూమెంట్(ఏఐడీఆర్ఎం) జాతీయ సమావేశాలు తిరుపతిలో జరగనున్నాయని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, ఉపాధ్యక్షుడు ఎస్.నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ పాలనలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక సందర్భాలలో మత ప్రస్తావన, కుల, ప్రాంతాల మధ్య విద్వేషాలను పాలకులే స్వయంగా రెచ్చగొడుతున్నారని విమర్శించారు. దేశ సమైక్యత, సమగ్రత, స్వేచ్ఛను కాపాడుకోవాలంటే... లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలు ఉద్యమించాలన్నారు. రాజకీయ పార్టీలు విభేధాలు విస్మరించి ఏకోన్ముఖంగా ముందు సాగాలని కోరారు.

పార్లమెంట్‌లో రాచరిక పోకడలకు చిహ్నమైన రాజదండం కాకుండా రాజ్యాంగాన్ని ప్రతిష్ఠించి...రాజ్యాంగం సక్రమ అమలుకు పాలకులు కృషి చేయాలన్నారు. రాజదండం స్థానంలో రాజ్యాంగం ప్రతిష్టించాలనే అంశంపై ఈ నెల 20వ తేదీన గంధమనేని శివయ్య భవన్‌లో సదస్సు జరుగుతుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో ప్రధాన వక్తగా జీవీ మురళీధర్, కాంగ్రెస్ నాయకులు మాగంటి గోపాల్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, సీపీఎం నాయకులు వందవాసి నాగరాజు, ఏఐడీఆర్ఎం జాతీయ అధ్యక్షుడు ఏ.రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి వీఎస్ నిర్మల, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి హాజరవుతారని తెలిపారు.

వైద్యుల ఆందోళనకు ఏఐటీయూసీ సంఘీభావం

విశాలాంధ్ర-విజయవాడ: కోల్‌కతాలోని ఆర్జీ కార్ వైద్య కళాశాల ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థినిపై జరిగిన దారుణమైన అత్యాచారం, హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి తరపున తీవ్ర వేదన వ్యక్తం చేశారు. మహిళా వైద్యులకు న్యాయం, భద్రత, రక్షణ కోసం సమ్మె చేస్తున్న వైద్యులకు ఏఐటీయూసీ సంఘీభావం ప్రకటిస్తున్నదని పేర్కొన్నారు. నేరంపై త్వరితగతిన విచారణ జరిపి... దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అన్ని ఆసుపత్రుల్లో క్రమబద్ధమైన పని గంటలు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్ల సౌకర్యాలు, సురక్షితమైన పని పరిసరాలు ఉండేలా చట్టం చేయాలని కోరారు. ప్రాణాలు కాపాడుతామని ప్రతిజ్ఞ చేసిన పదివేల మంది వైద్యులు న్యాయం, భద్రత, రక్షణను కోరుతూ వీధుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్రాల్లో సంఘీభావంగా డాక్టర్ల నిరసనలో ఏఐటీయూసీ పాల్గొంటున్నదన్నారు.

ఎంవీ రమణ సంస్మరణ సభ నేడు

విశాలాంధ్ర- అనంతపురం: సమసమాజ నిర్మాణ స్వాప్నికులు, పార్టీ నిర్మాణ కర్త, స్ఫూర్తిదాయి, నిజాయతీ నిబద్ధతలకు కొలబద్ద ఎంవీ రమణ సంస్మరణ సభ ఆదివారం(నేడు) ఉదయం 11 గంటలకు అనంతపురంలోని లలిత కళా పరిషత్ హాలులో జరుగుతుంది. ఎన్‌వీ రమణ సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడిగా, అనంతపురం ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఎంవీ రమణ 7వ తేదీన అనారోగ్యంతో కన్నుమూసిన విషయం విదితమే. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు ఉద్యమంతోపాటు అనేక పోరాటాల్లో రమణ పాల్గొన్నారు.

మెడికో హత్యపై ఫాస్ట్‌ట్రాక్ విచారణ జరపాలి: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కోల్‌కతాలో మెడికోపై అత్యాచారం, హత్య మానవాళిపై జరిగిన తీవ్రమైన దాడిగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అభివర్ణించారు. ఈ దారుణ ఘటనను శనివారం సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా ఖండించారు. రోజులు గడుస్తున్నా కేసులో పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యావత్ మానవజాతి సిగ్గుపడే ఈ ఘటనలో పూర్వాపరాలు బయటకు వస్తుంటే వెన్నులో వణుకుపుడుతోందన్నారు. వైద్య సిబ్బంది అంటే మనకు దేవదూతలతో సమానమని అన్నారు. ఒక మహిళగా ఇది నన్ను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఒక ఆడపిల్ల తల్లిగా ఇది నాలో భయం నింపిందని అన్నారు. గత పదేళ్లుగా మహిళలపై అసంఖ్యాకమైన దాడులు జరిగాయి, అత్యాచారాలు, హత్యలు కూడా చేశారన్నారు. అత్యాచారాలు, హత్యల నుంచి మహిళలకు రక్షణ కల్పించకుండా, ప్రభుత్వాలు దోషులకు రక్షణ కవచంగా వ్యవహరిస్తూ, ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరమని అన్నారు. గడిచిన పదేళ్లను పరిశీలిస్తే, మహిళల భద్రతకు రూ.7,214 కోట్లు కేటాయించగా... కేవలం రూ. 5,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగాలని షర్మిల డిమాండ్ చేశారు. అసలైన నిందితులను తక్షణమే ఫాస్ట్ ట్రాక్ విచారణ జరిపి, కఠినమైన శిక్షలు విధించాలని కోరారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం: టీడీపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని... అర్జీదారులను సాదరంగా ఆహ్వానించి వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తున్నామని టీడీపీ నేతలు పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లడంతో వినతులను మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య స్వీకరించారు. సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి పరిష్కరానికి కృషి చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇటువంటి జవాబుదారితనం లేదని నేతలు అన్నారు. నేడు పార్టీలకతీతంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలని... రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నదే చంద్రబాబు ధ్యేయమని వర్ల పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తమవిగా భావించి పనిచేసేదే కూటమి ప్రభుత్వం అన్నారు. కోల్‌కతాలో జరిగిన ఘటనలు మన రాష్ట్రంలో జరక్కుండా మహిళలు, మహిళా డాక్టర్ల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే వైద్య, హోంశాఖ మంత్రులకు సీఎం ఆదేశాలిచ్చారన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

ఆర్.పి.సిసోడియా

విశాలాంధ్ర-విశాఖ: గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో విశాఖలో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై, అక్రమ కేటాయింపులు, ఫ్రీ హోల్డ్ భూముల బదలాయింపులు, కబ్జాలపై కూటమి ప్రభుత్వం కదిలింది. రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా రెండు రోజులుగా విశాఖ జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. శనివారం వివాదాస్పద భూములను పరిశీలించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ, జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. లేఅవుట్ల అప్రూవల్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సరస్సులు, కాలువలు ఉండే ప్రాంతాల్లో ఒకటికి రెండు సార్లు పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం సాయంత్రం ఆయన తహశీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ రెవెన్యూ విభాగాల అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భూముల రిజిస్ట్రేషన్, 22ఏ, డి నోటిఫైడ్, భూసేకరణ, సమీకరణ, ఫ్రీ హోల్డ్, డిజిటలైజేషన్, జాయింట్ ఎల్పీఎంల రూపకల్పన, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనప్పుడు స్థానికంగా అనుసరిస్తున్న విధానాలు, ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. 22ఏ పరిధి నుంచి తొలగించినవి, ఫ్రీ హోల్డ్ చేసిన భూముల వివరాలపై ఆరా తీశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులపై స్థానిక అధికారులు తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిసోడియా మాట్లాడుతూ రికార్డుల డిజిటైలేజేషన్ ద్వారా ప్రభుత్వ భూములను కాపాడుకునే అవకాశం ఉందని, ఆ దిశగా అధికారులు దృష్టి సారించాలన్నారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఉండే భూములను వర్గీకరిస్తూ రెవెన్యూ, జీవీఎంసీ రెవెన్యూ విభాగం ఒక్క రకం భూమికి ఒక్కో రకం రంగు చూపించే మ్యాప్ రూపొందిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వాటిని జీపీఎస్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి 3డి మ్యాపింగ్ రూపొందించాలని, వీలుంటే ఏఐ టెక్నాలజీ సహాయాన్ని తీసుకోవాలన్నారు. రికార్డులు ఓవర్ ల్యాపింగ్ కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. రిజిస్ట్రేషన్, ఇతర అవసరాల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కనీస వసతులు కల్పించాలని, వారిని మర్యాద పూర్వకంగా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో భాగంగా వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. 22ఏలో చేస్తున్న ప్రక్రియలకు సంబంధించి ఎప్పటికప్పుడు వివరాలను నవీకరించాలని సూచించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, అర్బన్ ల్యాండ్ విభాగం రూపొందిస్తున్న రికార్డుల వివరాల్లో తారతమ్యం లేకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ భూముల తాజా పరిస్థితిపై నివేదికలు ఇవ్వాలని సూచించారు. ప్లాన్ అప్రూవల్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదని తేల్చి చెప్పారు. దేవాదాయ భూముల సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. కాలువలు, చెరువులు, నీటి బావుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనధికారిక అనుమతులు లేని కట్టడాలపై దృష్టి సారించి సంయుక్త పరిశీలనలు చేసి చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, విశాఖపట్టణం, భీమిలి ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, సీతారాం మూర్తి, జిల్లా రిజిస్ట్రార్ సృజన, వివిధ మండలాల తహశీల్దార్లు, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ రెవెన్యూ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమూల్ పాల సేకరణ పునఃప్రారంభించాలి

ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వినతి

విశాలాంధ్ర-విజయవాడ: అమూల్ సంస్థ పాల సేకరణను ఆపేయడంపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ ఆందోళన వ్యక్తంచేశారు. అనంతపురం, తిరుపతి, చిత్తూరు, కడప, సత్యసాయి జిల్లాల్లో పాల సేకరణ నిలిచిపోయిందని, దీనిపై తక్షణమే జోక్యం చేసుకొని రైతులను ఆదుకోవాలని శనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి నాయకులు విజ్ఞప్తిచేశారు. 500కు పైగా గ్రామాల్లో పాల సేకరణను నిలిపివేస్తున్నట్లు పాల సేకరణదారులకు (కార్యదర్శులకు), మహిళా రైతులకు ఫోన్ ద్వారా అమూల్ సంస్థ సమాచారం ఇచ్చిందని తెలిపారు. మహిళా రైతులు, కార్యదర్శులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఏపీ డెయిరీ యాజమాన్యం, అమూల్ యాజమాన్యాల దృష్టికి విషయం తీసుకెళ్లినా ఫలితం లేదని, పాలు సేకరిస్తామన్న హామీ రాలేదని నాయకులు పేర్కొన్నారు. ఏపీ డెయిరీ ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దల నుంచీ ఎలాంటి హామీ లభించలేదని, దీంతో మదనపల్లిలోని అమూల్ పాల సేకరణ కేంద్రం వద్ద రైతులు శనివారం నిరసన తెలిపారని ప్రకటనలో నాయకులు వెల్లడించారు. గుజరాత్ కో-ఆపరేటివ్ పాల వ్యాపార సంఘం అనుమతితో రాయలసీమలో పాలు సేకరిస్తున్న ట్రైరా పాల ఉత్పత్తిదారుల సంఘం ఆదేశాల మేరకు పాల సేకరణ నిలిచిపోయినట్లు తెలిసిందని ప్రభుత్వానికి తెలిపారు. 19 జిల్లాల్లో సుమారు 4.5 లక్షల లీటర్ల పాల సేకరణకు గత ప్రభుత్వం అమూల్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్నట్లు గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని 500 గ్రామాలకు చెందిన మహిళా పాల సేకరణ కేంద్రాలకు భరోసా ఇవ్వాలని నాయకులు కోరారు.

చంద్రబాబుకు ఈశ్వరయ్య లేఖ

గనుల తవ్వకాలపై నిర్దిష్ట ప్రణాళిక రూపొందించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య లేఖ రాశారు. బెరైటిస్, బాల్‌క్లే, గ్రానైట్ మొదలగు గనులను కొందరు లాభాపేక్షతో విచ్చలవిడిగా తవ్వకాలు జరిపి పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారని, పర్యావరణానికి హాని జరగకుండా మైనింగ్ కార్యకలాపాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే విధంగా మైనింగ్ లీజులు తయారుచేసి... దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఈ విధంగా జరగకుండా కఠినమైన మైనింగ్ పాలసీ తీసుకురావాలని సూచించారు.

స్వర్ణభారత్ సేవాప్రస్థానం స్ఫూర్తిదాయకం

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: స్వర్ణభారత్ ట్రస్ట్ 23 ఏళ్ల ప్రస్థానం అంటే అంకెలు కాదని, స్ఫూర్తిదాయక గమనమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ అన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ముందుగా అక్షర విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించి వారిని అభినందించారు. అనంతరం విద్యాలయం ఆవరణలోని సోమా నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని సందర్శించి శిక్షణార్థులతో ముచ్చటించి, నైపుణ్య కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ట్రస్ట్ ఆవరణలో నూతనంగా నిర్మించిన అడ్మిన్ బిల్డింగ్‌ను ప్రారంభించారు. అనంతరం మొక్కను నాటారు. స్వర్ణభారత్ ట్రస్ట్-భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయ సమితి అధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న జైపూర్ ఫుట్ ఉచిత శిబిరాన్ని సందర్శించి కొందరికి కృత్రిమ అవయవాలను అందజేశారు. ట్రస్ట్ ఆవరణలో దంత, సాధారణ వైద్యశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ముప్పవరపు వెంకయ్య నాయుడు జీవన ప్రస్థాన ఛాయా చిత్ర ఆంగ్ల గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ వెంకయ్య నాయుడు ఆలోచనలు మహోన్నతమైనవని అన్నారు. ఆయన హృదయం ఎప్పుడూ గ్రామీణ ప్రాంతాలతో మమేకమై ఉందని, దానికి వారి మానసపుత్రికగా ఈ ట్రస్ట్ ఓ ఉదాహరణగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్‌ను అభినందించారు. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ స్వర్ణభారత్ ట్రస్ట్ 23 ఏళ్ల క్రితం మిత్రుల సహకారంతో ప్రారంభమై లక్ష మందికి పైగా యువతకు నైపుణ్య శిక్షణ అందించిందన్నారు. అలాగే మన భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవటానికి నిబద్ధతో పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి, పూర్వ ఉపరాష్ట్రపతి దంపతులతో పాటు ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, పార్లమెంటు సభ్యులు బీదా మస్తాన్ రావు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ట్రస్టీలు సహా అనేక మంది ప్రముఖులు హాజరయ్యారు.

జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం

ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవాల్లో నేతల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ 68వ వ్యవస్థాపక దినోత్సవాలు శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ప్రదర్శనలు, మోటారు సైకిల్ ర్యాలీలు, వివిధ అంశాలపై సదస్సులు, మొక్కలు నాటడం, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు, వృద్ధాశ్రమాలు, అనాథ ఆశ్రమాల్లో పండ్ల పంపిణీ వంటి వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సేవా కార్యక్రమాల్లో మంత్రులు, ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు భాగస్వాములయ్యారు. విజయవాడ యూనిట్ అధ్యక్షుడు చావా రవి అధ్యక్షతన ప్రెస్‌క్లబ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. యూనియన్ ఏడు దశాబ్దాల కాలంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం, వారి హక్కుల సాధన కోసం, భావ ప్రకటనా స్వేచ్ఛ రక్షణ కోసం నిర్వహించిన చరిత్రాత్మక పోరాటాలను వివరించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తోందని, మీడియా గొంతు నొక్కే చర్యలకు పాల్పడుతోందని, దీనిపై జర్నలిస్టులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్మలాభవన్‌లోని వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. విజయనగరం జిల్లాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, తాడేపల్లిగూడెం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, తిరుపతిలో ఐజేయూ కార్యవర్గసభ్యులు డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు. జర్నలిస్టుల భద్రత కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒక ప్రత్యేక చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలపై ఏపీయూడబ్ల్యూజే రూపొందించిన పదిహేను అంశాల డిమాండ్ల పత్రాన్ని ఇప్పటికే సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి, శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లాకు అందచేశామని తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి జర్నలిస్టుల సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా, సంక్షేమ నిధి, ఇళ్లస్థలాలు, రిటైర్ అయిన వారికి పెన్షన్ సౌకర్యం, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం వంటి అంశాలపై యూనియన్ దృష్టి సారిస్తున్నట్లు వారు చెప్పారు.

సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

జంగాల అజయ్ కుమార్

విశాలాంధ్ర-తెనాలి: సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. తెనాలి, గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ, పట్టణ కార్యవర్గ సభ్యుల సమావేశం పరుచూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి అజయ్ కుమార్ మాట్లాడుతూ కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆస్పత్రుల్లో రోగులకు చికిత్స అందించే వైద్యులకే రక్షణ లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళలకు రక్షణగా ప్రత్యేక చట్టం తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం, ఆయా రాష్ట్రాలు ముందుకు రావాలని కోరారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో అత్యధిక ప్రజలు తినడానికి తిండిలేక, పనిలేక అలమటిస్తున్నారన్నారు. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ వంటి ధరలు అనేక రెట్లు పెరగడంతో దాని ప్రభావం నిత్యావసర సరుకులపైన పడి సామాన్య ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. ఆర్థిక, పారిశ్రామిక రంగాన్ని బడా పారిశ్రామికవేత్తలకు మోదీ ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. దేశంలో సామాజిక స్థితి గతులు నానాటికీ అధ్వానంగా మారుతున్నాయన్నారు. మోదీ పాలన ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ పరివార్ శక్తుల కనుసన్నల్లో కొనసాగుతుందనడానికి మణిపూర్‌లో జరిగిన దాడులు, మారణకాండ ఉదాహరణ అని అన్నారు. పరుచూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీపీఐ తెనాలి డివిజన్ మాజీ కార్యదర్శి బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ ప్రతి సభ్యుడు క్రమశిక్షణతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని, ఊరూరా జెండా ప్రతిష్ఠాపన చేయాలని కోరారు. సీపీఐ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి గ్రామగ్రామాన, పట్టణ వార్డులలో సభ్యులను చేర్పించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్, ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రవితేజ, రాజేష్, చెన్నూరు సాయి, కావేటి యశ్వంత్, భూమేష్, ప్రసన్న, గణేష్, అమాన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చలనచిత్ర విజేతలకు పవన్ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జాతీయ చలనచిత్ర పురస్కారాలకు ఎంపికైన నటీనటులు, దర్శక, నిర్మాతలు, సాంకేతిక నిపుణులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రాల విభాగంలో తెలుగు నుంచి కార్తికేయ 2 అవార్డు పొందడం సంతోషకరమని అన్నారు. ఆ చిత్ర దర్శకుడు చందు మొండేటి, నిర్మాతలు అభిషేక్ అగర్వాల్, టీజీ విశ్వప్రసాద్, కథానాయకుడు నిఖిల్ సిద్ధార్థ్, చిత్ర బృందాన్ని అభినందించారు. తెలుగు అనువాద చిత్రాలు కాంతారా, పొన్నియన్ సెల్వన్ 1, తిరుచిత్రాంబళం, కేజీఎఫ్ 2 వివిధ కేటగిరిల్లో పురస్కారాలు పొందాయన్నారు. ఉత్తమ నటి నిత్య మీనన్, ఉత్తమ నటుడు రిషబ్ శెట్టి, నృత్య దర్శకుడు జానీ మాస్టర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

వెలుగూరి రాధాకృష్ణమూర్తి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే నిలుపుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1, 2, 3 తేదీలలో విశాఖలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలని కోరారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక బడా కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రుణాలను మాఫీ చేశారని మండిపడ్డారు. అసంఘటిత రంగ కార్మికులను, ప్రభుత్వ స్కీం ఉద్యోగులను కట్టు బానిసలుగా మారుస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని ధ్వంసం చేస్తున్నారని, బడా పారిశ్రామికవేత్తలకు వీటిని అప్పగిస్తున్నారని తెలిపారు. ఇలాంటి తరుణంలో కార్మికులు సంఘటితంగా పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ పల్నాడు జిల్లా అధ్యక్షులు కాసా రాంబాబు, సీపీఐ చిలకలూరిపేట ఇన్‌ఛార్జ్ కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, ఏఐటీయూసీ చిలకలూరిపేట నియోజకవర్గ అధ్యక్షులు పేలూరి రామారావు, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లూరి బాబురావు, తాపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కాసా సాంబయ్య, ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆవుల పోతురాజు, చలివేంద్రం బజార్ ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు రామారావు, హనుమంతరావు, కృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం చిలకలూరిపేట నియోజకవర్గ అధ్యక్షులు తూబాటి సుభాని, సురభయ్యా, ఆరాధ్యుల రామకృష్ణ, బొంతా భగత్ సింగ్, మేకపోతుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల మృతిపై లోకేశ్ దిగ్భ్రాంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మన్యం జిల్లా సరాయివలస వద్ద వాగు ఉధృతికి కొట్టుకుపోయి ఇద్దరు ఉపాధ్యాయులు మృతి చెందడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పాచిపెంట మండలం కొటికిపెంట ఏకలవ్య పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని ఆర్తి, వార్డెన్ మహేశ్ శుక్రవారం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగివస్తూ రాయిమానువాగు వంతెనపై వరద ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందారు. ఈ ఘటనపై శనివారం లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. మృతులకు నివాళి అర్పించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

పిడుగుపాటుకు రైతు మృతి

విశాలాంధ్ర-చిలమత్తూర్ రూరల్: శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూర్ మండలం దిగువపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి సీతారాం నాయక్ (68) అనే రైతు పిడుగుపాటుతో మృతిచెందాడు. గ్రామ శివారులో పొలం వద్దే పూరిపాకలో ఉంటూ జీవనం సాగిస్తుండేవాడని, అతడికి ఉన్న అరకొర భూమిలో పంటలు పండిస్తూ ఉండేవాడని గ్రామస్థులు తెలిపారు. భారీవర్షం కురవడంతో పిడుగుపాటుకు గురై మరణించాడని చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. సీతారాం నాయక్ హఠాత్ మరణాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమకు దిక్కెవరని బోరున విలపిస్తున్నారు. జీవనాధారం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పోలవరాన్ని గోదాట్లో ముంచారు

వైసీపీ నేతలపై మంత్రి నిమ్మల ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదని, అయిదేళ్ల పాటు అధికారంలో ఉండి పోలవరాన్ని గోదావరిలో ముంచేసిన వాళ్లు ఇప్పుడు మాట్లాడుతున్నారంటూ ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. వైసీపీ తీరు చూస్తుంటే దొంగే... దొంగా దొంగా అని అరచినట్లు ఉందని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టు నిధుల విడుదల కోసం ఢిల్లీ వెళ్లిన మంత్రి నిమ్మల శనివారం మీడియాతో మాట్లాడారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం పోలవరానికి రూ.11,500 కోట్లకు పైగా ఖర్చు పెట్టిందని, ఆ సమయంలో కేంద్రం రీయింబర్స్‌మెంట్ ద్వారా రూ.6 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. వైసీపీ అయిదేళ్ల పాలనలో రూ.4,167 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని, కానీ మా హయాంలో జరిగిన పనితో కలుపుకుని రీయింబర్స్‌మెంట్ కింద రూ.8,382 కోట్లు వచ్చాయని గుర్తు చేశారు. అలా వచ్చిన పోలవరం నిధులను ప్రాజెక్టు కోసం ఖర్చుపెట్టకుండా దారి మళ్లించారని అన్నారు. కేంద్రం నిధుల కోసం ఎదురు చూడకుండా రాష్ట్ర ఖజానా నుంచే ఖర్చు చేసిన చరిత్ర టీడీపీదని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు గైడ్ బండ్ కుంగిపోవడం సహా అంచనాలు పెంచి టెండర్లు పిలిచిన అంశాలన్నీ ఒక్కొక్కటిగా బయటికొస్తున్నట్లు మంత్రి చెప్పారు. శాఖాపరంగా దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వైసీపీ హయాంలో ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మాణం పూర్తికాకపోవడం వల్ల 2020 భారీ వరదలకు డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నమాట వాస్తవం కాదా అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను ప్రశ్నించారు. దీనిపై ఐఐటీ హైదరాబాద్ నిపుణులు ఇచ్చిన నివేదిక వాస్తవం కాదా అని నిలదీశారు. 2014-19 మధ్య ఉన్న ఏజెన్సీలను రద్దు చేయడం వల్లే కొత్త ఏజెన్సీ పనులు చేపట్టడానికి 13 నెలల సమయం పట్టిందని చెప్పారు. వైసీపీ తీరు వల్ల ఆ 13 నెలల సమయం అంతా వృథా అయ్యిందని అన్నారు. ఒకే పనిని రెండు ఏజెన్సీలతో చేయిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) గత ప్రభుత్వానికి లేఖ రాయడం జరిగిందన్నారు.

సంపాదకీయం

ఎన్నికల కమిషన్ ప్రభు భక్తి

జమ్మూ-కశ్మీర్, హర్యానా శాసనసభల ఎన్నికల తేదీలను ఎన్నికల కమిషన్ శుక్రవారం ప్రకటించింది. ఈ ఎన్నికల ప్రక్రియ సెప్టెంబర్ 18న మొదలై అక్టోబర్ ఒకటో తేదీతో ముగుస్తుంది. జమ్మూ-కశ్మీర్ శాసనసభకు మూడు విడతల్లో పోలింగ్ జరుగుతుంది. హర్యానాలో మాత్రం ఒకే విడత అక్టోబర్ ఒకటిన పోలింగ్ జరుగుతుంది. జమ్మూ-కశ్మీర్ లో మొదటి దశ పోలింగ్ సెప్టెంబర్ 18న, రెండో దశ సెప్టెంబర్ 25న, మూడో దశ అక్టోబర్ 1న జరుగుతుంది. జమ్మూ-కశ్మీర్‌లో పదేళ్ల తరవాత శాసనసభ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ విడత ఎన్నికలు నిర్వహించేది రెండే రాష్ట్రాలు అయినప్పుడు జమ్మూ-కశ్మీర్‌లో మూడు విడతల్లో పోలింగ్ నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటో అంతుపట్టదు. కేంద్ర ప్రభుత్వం చెప్తున్నదాన్నిబట్టి అక్కడ అంతా సుఖశాంతులే వెల్లివిరుస్తున్నాయి. తీవ్రవాదం తోక ముడిచిందంటున్నారు. రెండు రాష్ట్రాలలో ఒకే విడత ఎన్నికలు నిర్వహించడానికి కావలసిన బందోబస్తు ఏర్పాటు చేయడానికి భద్రతా సిబ్బంది కొరత ఉందన్న వాదనను అంగీకరించలేం. సెప్టెంబర్ 30వ తేదీలోగా జమ్మూ-కశ్మీర్ శాసనసభ ఎన్నికలు పూర్తి కావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణాన్ని రద్దు చేయడాన్ని, జమ్మూ-కశ్మీర్‌కు ఉన్న రాష్ట్ర పతిపత్తిని లాగేయడాన్ని సుప్రీంకోర్టు ఆక్షేపించలేదన్న వస్తవాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. 2019 ఆగస్టు అయిదున జమ్మూ-కశ్మీర్ కు వర్తించే 370వ అధికరణాన్ని రద్దు చేయడమే కాక జమ్మూను, కశ్మీర్‌ను, లదాక్‌ను మూడు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడదీశారు. జమ్మూ-కశ్మీర్ కు ఉన్న రాష్ట్ర ప్రతిపత్తిని త్వరలోనే పునరుద్ధరిస్తామని కూడా మోదీ ప్రభుత్వం అప్పుడు వాగ్దానం చేసింది. అన్న అవకాశం అయిదేళ్లయినా రానే లేదు. ఎన్నికలు ప్రకటించిన జమ్మూ-కశ్మీర్, హర్యానా తో పాటు మహారాష్ట్ర శాసనసభకు కూడా ఎన్నికలు నిర్వహించవలసి ఉన్నా ఎన్నికల కమిషన్ మహారాష్ట్ర ఎన్నికలను ప్రస్తుతానికి నిర్వహించడం లేదు. నిజానికి హర్యానా, మహారాష్ట్ర శాసనసభల గడువు దాదాపు ఒకేసారి ముగుస్తుంది. హర్యానా శాసనసభ గడువు నవంబర్ మూడున ముగుస్తుంది. మహారాష్ట్ర శాసనసభ గడువు నవంబర్ 26న ముగుస్తుంది. అయినా హర్యానా శాసనసభకు నవంబర్ మూడున కొత్త శాసనసభ ఏర్పడేలా కాకుండా రెండు నెలలకు పైగా ముందుకు లాగారు. అదేసూత్రం మహారాష్ట్రకు ఎందుకు వర్తింప చేయలేదో తెలియదు. అదేమంటే ఎన్నికల కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ నిర్ధారిస్తుంది అంటారు. కానీ ఎన్నికల కమిషన్‌కు మోదీ హయాంలో అంత స్వేచ్ఛ ఎక్కడుంది కనక! అంతా మోదీ చెప్పినట్టే జరగుతుంది. అంటే మహారాష్ట్రలో మిగతా రెండు శాసనసభలతో పాటే ఎన్నికలు నిర్వహించడం బీజేపీకి అనుకూలం కాదని మోదీ, ఆయన నాయకత్వంలోని బీజేపీ భావించినట్టుంది. జమ్మూ-కశ్మీర్‌లో ఇటీవల సార్వత్రిక ఎన్నికల సమయంలో లోక్‌సభ స్థానాలకు కూడా ఎన్నికలు జరిగాయి. జమ్మూ ప్రాంతంలో బీజేపీ రెండు స్థానాలు సంపాదించింది. మరో స్థానంలో స్వతంత్ర అభర్థి గెలిచారు. కశ్మీర్ లోయలోని స్థానాలకు పోటీచేసే సాహసమే బీజేపీకి లేకుండా పోయింది. ఉత్తర ప్రదేశ్‌లో పది శాసనసభా స్థానాలకు ఉప ఎన్నికలు జరగవలసి ఉంది. కానీ ఆ ఎన్నికల కార్యక్రమాన్ని ఇంకా ప్రకటించలేదు.

ఒకే దేశం-ఒకే ఎన్నికలు అని అవకాశం వచ్చినప్పుడల్లా నినదించే మోదీ ప్రభుత్వం మూడు రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎందుకు ఎదుర్కోలేకపోతోందో తెలియదు. ఇది మోదీ మాటలకు, చేతలకు ఉండే సహజ వ్యత్యాసమే అనుకోవాలి. హర్యానాలో ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వమే ఉంది. కానీ ఎన్నికలు జరిగితే అక్కడ బీజేపీ అధికారం కోల్పోవచ్చునన్న అంచనాలు ఉన్నాయి. అక్కడ కాంగ్రెస్ బలపడిందంటున్నారు. జమ్మూ-కశ్మీర్ లో బీజేపీ అదృష్టం పరీక్షించుకోవలసిందే. జమ్మూలో పరిస్థితి బీజేపీకి కొంత అనుకూల పరిస్థితి ఉండొచ్చు. కశ్మీర్ లో మాత్రం ఎదురుదెబ్బ తప్పకపోవచ్చు. మహారాష్ట్రలో ప్రస్తుతం అజిత్ పవార్ నాయకత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్‌తో కలిసి బీజేపీ అధికారంలో ఉన్నారు. అజిత్ పవార్ నేషనలిస్టు కాంగ్రెస్ వర్గానికన్నా బీజేపీకి ఉన్న శాసనసభ్యుల సంఖ్యే ఎక్కువ. కానీ కాంగ్రెస్, శరద్‌పవర్ నాయకత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్, శివసేన, ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని మహా వికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని బీజేపీ కూల్చేసింది. శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్‌ను బీజేపీ నిలువునా చీల్చేసింది. ప్రాంతీయ పార్టీల అస్తిత్వాన్ని అంతం చేయడానికి ముందు వాటిని చీల్చడం బీజేపీ నిరంతరం అనుసరించే ప్రక్రియ. అందులో భాగంగానే దేవేంద్ర ఫడ్నవిస్ నాయకత్వంలోని బీజేపీకి అధిక స్థానాలున్నా తక్కువ స్థానాలున్న అజిత్ పవార్‌ను ముఖ్యమంత్రిని చేసింది. ఫడ్నవిస్ ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకున్నారు. అజిత్ పవార్ నాయకత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్ అసలైన నేషనలిస్టు కాంగ్రెస్ అని ఎన్నికల కమిషన్ నిర్ధారించింది. కానీ జనబలం మాత్రం శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకే ఉన్నట్టు లోక్‌సభ ఎన్నికలతోపాటు అనేక సందర్భాలలో తేలిపోయింది. లోక్‌సభ ఎన్నికలలో అజిత్ పవార్ భార్యే ఘోరంగా ఓడిపోయారు. ఈ ఎదురు దెబ్బలను భరించి నిలదొక్కుకోగలన్న ఆత్మస్థైర్యం అజిత్ పవార్‌కు లోపించినట్టు అనేక సంఘటనలు రుజువు చేస్తున్నాయి. మళ్లీ శరద్ పవార్ పంచన చేరితే తప్ప తనకు, తన చీలిక వర్గానికి అస్తిత్వం ఉండదు అన్న భయం ఆయనను పీడిస్తోంది. అజిత్ పవార్ వర్గంలోని సీనియర్ నాయకులు కొందరు అవకాశం వచ్చినప్పుడు శరద్ పవార్ నాయకత్వంలోని పార్టీలో దూకే అవకాశాలు మెండుగా ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికలలో తన భార్యనే గెలిపించుకోలేనని అజిత్ పవార్‌ను భయం పీడిస్తోంది. తన భార్య చేత, పెదనాన్న కూతురిపై తన భార్యను పోటీ పెట్టకుండా ఉండవలసిందని అజిత్ పవార్‌కు ఆలస్యంగా జ్ఞానోదయం అయింది. అందుకే ఆ మధ్య శరద్ పవార్ ను కలుసుకున్నారు. తనతోపాటు గోడ దూకి వచ్చినవారు ఎన్నికల సమయం వచ్చే సరికి ఒక్కుమ్మడిగా పక్షుల్లా లేచిపోయి శరద్ పవార్ గూట్లో వాలితే అజిత్ పవార్ కు మిగిలేది ఏమీ ఉండదు. ఆ స్థితిలో అజిత్ పార్టీకి అస్తిత్వమే లేకుండా చేయడానికి బీజేపీ చేయగలిగినదంతా చేస్తుంది. ఇలాంటి లెక్కలన్నీ తేలాల్సి ఉన్నాయి. ఈ లోగా ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మహారాష్ట్రలో అనేకసార్లు వాలి పోవాలి కదా! దానికి మరింత సమయం కావాలి కాబట్టే మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలను మిగతా రెండు శాసనసభ ఎన్నికలతో పాటు నిర్వహించడంలేదు. ఎన్నికల కమిషన్ మోదీ చేతిలో ఉన్నంత కాలం ఇలాంటి ఎత్తుగడలన్నీ కష్టం కాదు.

కార్మికుల సమస్యలపై నిత్యపోరాటయోధ కొరారి

చలసాని వెంకటరామారావు

కృష్ణాజిల్లా పెడన తాలూకా చెన్నూరు గ్రామంలో 1934 ఆగస్టు 15 న కొరారి శ్రీరాములు, వేంకటేశ్వరమ్మ దంపతులకు కామ్రేడ్ కొరారి నరసింహారావు జన్మించారు. ఈ ఆగస్టు 15 న ఆయన 90 వ జన్మదినోత్సవం. 2000 సంవత్సరం ఆగస్టు 17 న వీరు మరణించారు. ఈ ఆగస్టు 17 కు కామ్రేడ్ నరసింహారావు మరణించి 25 సంవత్సరాలు పూర్తి అవుతుంది. తాను పుట్టి పెరిగిన చెన్నూరులో ప్రాథమిక విద్యను, గుడ్లవల్లేరులో పీయూసి పూర్తి చేశారు. తరువాత స్వయం ఉపాధి రంగాన్ని ఎంచుకుని గ్రామఫోన్, మైక్‌సెట్‌తో పాటు ఇళ్లకు ఎలక్ట్రికల్ పనిచేసే వృత్తిని ఎంచుకున్నారు. తమ ప్రాంతంలో జరిగే కమ్యూనిస్టు పార్టీ సభలకు తరచు వెళ్లి అక్కడ నాయకుల ప్రసంగాలతో ప్రభావితులై కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా చేరారు. కామ్రేడ్ కీ.శే పుచ్చలపల్లి సుందరయ్య సభలకు తన మైక్‌సెట్టును పెట్టటం, ఆయన ఉపన్యాసాల ప్రభావం తనపై పడి తానుకూడా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా పనిచేయాలని ఆకాంక్షించారు. తరువాత కాలంలో 1965 లో గుడివాడ వచ్చి స్థిరపడి రైసుమిల్లులలో పనిచేస్తున్న కార్మికుల, ముఠా పనిచేసే కార్మికుల దయనీయమైన పరిస్థితులు, తక్కువ వేతనాలు చూసి చలించి వారిని సంఘటితంచేసి ఒక ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి గుడివాడ పట్టణంలో వివిధ

రంగాలకు చెందిన వేలాదిమంది అసంఘటిత కార్మికులను సమీకరించి వారికి సంఘాలు ఏర్పాటు చేశారు. సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్, స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్, బజారు ముఠా కార్మికులను, ఆర్టీసీ పోర్టర్లకు, మార్కెట్ యార్డ్ హమాలీలకు ఇతరులకు అనేక కార్మిక సంఘాలను ఏర్పాటు చేశారు. నిత్యం గుడివాడ పట్టణంలో కార్మికుల పక్షాన ఎన్నో పోరాటాలకు కామ్రేడ్ నరసింహారావు నాయకత్వం వహించారు. ఎఐటీయూసీ గుడివాడ పట్టణ కార్యదర్శిగా, నాటి ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శులలో ఒకరిగాఉంటూ అసంఘటిత కార్మికుల హక్కులకోసం నిలిచారు. కార్మికుల పక్షానే కాకుండా యజమానుల కష్టసుఖాలను, వారి ఇబ్బందులను గుర్తించి కార్మికుల వేతనాలు, కూలిరేట్లు, బోనసులు, పనిగంటలు వంటి అంశాలలో యాజమాన్యాలను ఒప్పించి వేతన ఒప్పందాలు చేయటంలో కామ్రేడ్ నరసింహారావు దిట్ట. అనేక సందర్భాలలో మిల్లుల యజమానులు, షావుకార్లు తమ మధ్య వచ్చే తగాదాల పరిష్కారానికి సైతం నరసింహారావును పెద్ద మనిషిగా పెట్టుకుని తమ సమస్యలను పరిష్కరించుకునేవారు. గుడివాడ పట్టణ సీపీఐ కార్యదర్శిగా వివిధ కార్మికవాడలలోని సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేశారు. కార్మికులకు వ్యక్తిగత సమస్యలు వచ్చిన సందర్భాలలో సైతం వారి తరపున నిలబడి వారికి న్యాయం జరిగే వరకు శ్రమించేవారు. గుడివాడ పట్టణంలో అసంఘటిత రంగంలోని కార్మికులకు తలలో నాలుకలా ఉండి కామ్రేడ్ నరసింహారావు సేవ చేశారనడంలో అతిశయోక్తి లేదు.

గుడివాడ పట్టణంలో కార్మికుల చైతన్య స్థాయి పెరిగిన తరువాత కామ్రేడ్ నరసింహారావు కృష్ణాజిల్లా అన్ని ప్రాంతాలలో కార్మికోద్యమ విస్తరణకు కృషి ప్రారంభించారు. అందులో భాగంగా నూజివీడులో రైస్‌మిల్లు, ఆయిల్ మిల్లులలోని కార్మికులను, ముఠా కార్మికులను, సిగార్ కార్మికులను సంఘటితం చేసి వారికి యూనియన్లు స్థాపించారు. నూజివీడులో సంఘాలు పెట్టిన తొలిరోజులలో 1972-75 ప్రాంతంలో యజమానులకు, కార్మికులకు తీవ్ర సంఘర్షణ ఏర్పడింది. ఈ సందర్భంగా రైసు మిల్లులు మూసివేయటం, కార్మికులు ఉపాధి కోల్పోయి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా కామ్రేడ్ కొరారి నరసింహారావును అరెస్టుచేసి నూజివీడు పోలీసుస్టేషనులో ఇతర కార్మికులతో పాటు నిర్బంధించారు. సీపీఐ నాయకులు చలసాని జగన్నాథరావు చొరవతో విజయవాడ ముఠా కార్మిక సంఘం నాయకులు పల్లా కనకారావు నూజివీడు వచ్చి సమస్యను పరిష్కరించారు. అనేక సందర్భాలలో నూజివీడులో యాజమాన్యంతో సమస్యలు వచ్చి పోలీసు కేసులు ఎదుర్కోవలసి వచ్చింది. చివరకు నరసింహారావు నిజాయితీ, మంచితనం గుర్తించిన యజమానులు వారే ఆయనను పిలిపించుకుని తమ సమస్యలను పరిష్కరించుకునేవారు. నూజివీడు తరువాత విసన్నపేట, తిరువూరు, కైకలూరు, మచిలీపట్నం, బంటుమిల్లిలో ముఠా కార్మికులను సమీకరించి సంఘాలు ఏర్పాటు చేశారు.

2000 వ సంవత్సరం ఆగస్టు నెలలో తీవ్ర అనారోగ్యానికి గురై 17 వ తేదీ హైదరాబాద్‌లో ఆయన గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలిసిన వేలాది మంది కార్మికులు రాష్ట్రం వివిధ ప్రాంతాల నుంచి గుడివాడ వచ్చి ఆయన అంతిమయాత్రలో పాల్గొని ఘనంగా నివాళు లర్పించారు. కామ్రేడ్ కొరారి నరసింహారావు 25 వ వర్ధంతి రజతోత్సవసభ నూజివీడులో జరగనుంది. ఎఐటీయూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకటరామారావు, హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్యలు ఈ సభలో పాల్గొననున్నారు. అసంఘటిత కార్మికుల హక్కులకోసం తన జీవితాన్ని అంకితం చేసిన నిరుపమాన త్యాగశీలి, కార్మిక యోధుడు కామ్రేడ్ కొరారి నరసింహారావుకు విప్లవ జోహార్లు!

(కామ్రేడ్ కొరారి నరసింహారావు 25 వ వర్ధంతి సభ ఆగస్టు 18 న నూజివీడులో జరుగుతున్న సందర్భంగా...)

ఎఐటీయూసి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు
సెల్: 9490952093

ప్రజాస్వామ్య విధ్వంసకారి అమెరికా

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

ప్రజాస్వామ్య ప్రోత్సాహం సాకుతో అమెరికా ప్రజాస్వామ్య జాతీయ ధర్మసంస్థ (నేషనల్ ఎండొమెంట్ ఫర్ డెమోక్రసీ-ఎన్.ఇ.డి.) జోక్యం, విధ్వంసక ప్రయత్నాల నుండి అంతర్జాతీయ సమాజం జాగ్రత్తగా ఉండాలి. అప్పుడే ప్రజాస్వామ్యం, అభివృద్ధి, శాంతి, అంతర్జాతీయ న్యాయం సాధ్యమవుతాయి. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, మానవ హక్కుల ముసుగులో విదేశాల అంతర్గత అంశాల్లో చొరబాటు, విధ్వంసంకోసం అమెరికా ఎన్.ఇ.డి.ని వాడుకుంటోంది. ఇది ఆ దేశాల సార్వభౌమాధికారం, అభివృద్ధి, ప్రయోజనాల, అంతర్జాతీయ చట్టం, అంతర్జాతీయ భద్రత సంబంధాల ప్రాథమిక నిబంధనల తీవ్ర ఉల్లంఘన, ప్రపంచ శాంతి, స్థిరత్వాన్ని తీవ్రంగా దెబ్బతీసింది.

అమెరికా ప్రభుత్వం నుండి నిధులు పొందుతున్న ఎన్.ఇ.డి. అమెరికా కేంద్ర నిఘా సంస్థ (సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ-సిఐఎ) రహస్య కార్యకలాపాలను అమలుచేస్తుంది. సిఐఎ, అమెరికా సమాఖ్య ప్రభుత్వ పౌర విదేశీ నిఘా సేవా సంస్థ. ప్రపంచం పది దిక్కుల నుండి అన్ని దేశాల జాతీయ భద్రత సమాచార సేకరణ, వ్యవహార ఆచరణ కార్యక్రమాల పద్ధతీకరణ, విశ్లేషణ దీని విధులు. అమెరికా ఎన్.ఇ.డి.ని తెల్ల చేతితొడుగులా పరిగణిస్తోంది. వైద్యశాలల, పరిశ్రమల, హోటళ్ళ, వితరణ సంస్థల శుభ్రతకు తెల్ల చేతితొడుగులు సంకేతం. ఇతర దేశాల్లో రాజ్యాధికార అణచివేత, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం, విభజన, ఘర్షణల ప్రేరేపణ, కార్పొరేట్ల ఆయుధాల అమ్మకానికి, విదేశాల ప్రకృతి, మానవ వనరుల దోపిడీకి యుద్ధాలు చేయించడం, ప్రజల అభిప్రాయాన్ని తప్పుదారి పట్టించడం, సైద్ధాంతిక, సాంకేతిక చొరబాట్ల నిర్వహణ వంటివి చాలా కాలంగా అమెరికా కొనసాగిస్తున్న అతిక్రమణ చర్యలు.

అమెరికా ప్రభుత్వం నుండి నిధులు పొందుతున్న ఎన్.ఇ.డి. అమెరికా కేంద్ర నిఘా సంస్థ (సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ-సిఐఎ) రహస్య కార్యకలాపాలను అమలుచేస్తుంది. సిఐఎ, అమెరికా సమాఖ్య ప్రభుత్వ పౌర విదేశీ నిఘా సేవా సంస్థ. ప్రపంచం పది దిక్కుల నుండి అన్ని దేశాల జాతీయ భద్రత సమాచార సేకరణ, వ్యవహార ఆచరణ కార్యక్రమాల పద్ధతీకరణ, విశ్లేషణ దీని విధులు. అమెరికా ఎన్.ఇ.డి.ని తెల్ల చేతితొడుగులా పరిగణిస్తోంది. వైద్యశాలల, పరిశ్రమల, హోటళ్ళ, వితరణ సంస్థల శుభ్రతకు తెల్ల చేతితొడుగులు సంకేతం. ఇతర దేశాల్లో రాజ్యాధికార అణచివేత, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం, విభజన, ఘర్షణల ప్రేరేపణ, కార్పొరేట్ల ఆయుధాల అమ్మకానికి, విదేశాల ప్రకృతి, మానవ వనరుల దోపిడీకి యుద్ధాలు చేయించడం, ప్రజల అభిప్రాయాన్ని తప్పుదారి పట్టించడం, సైద్ధాంతిక, సాంకేతిక చొరబాట్ల నిర్వహణ వంటివి చాలా కాలంగా అమెరికా కొనసాగిస్తున్న అతిక్రమణ చర్యలు.

"దశాబ్దాలుగా సిఐఎ రహస్యంగా చేస్తున్న పనులను ఎన్.ఇ.డి. బహిరంగంగా చేస్తుంది. దాంతో సిఐఎ రహస్య చర్యల నిర్వహణల కళంకాన్ని తొలగిస్తుంది" అని అమెరికా పండితుడు, రచయిత, పాత్రికేయుడు, అమెరికా విదేశాంగ విధాన విమర్శకుడు 85 ఏళ్ల వయసులో 2018 డిసెంబర్ 9 న మరణించిన విలియం బ్లమ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ శాంతి కార్నెగీ ధర్మసంస్థ (కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్) నివేదిక ప్రకారం, అన్ని ఎన్.ఇ.డి. నిధులు అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) నుండి వచ్చాయి. అంతర్జాతీయ శాంతి కార్నెగీ ధర్మసంస్థ ఐరోపా, దక్షిణ, తూర్పు ఆసియా, మధ్య ప్రాచ్యం, అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో అంతర్జాతీయ వ్యవహారాల నిష్పక్షపాత తాత్విక సంస్థ. ఎన్.ఇ.డి. దీర్ఘకాలిక లక్ష్యం అమెరికా శత్రువుల ప్రత్యర్థులను అంటే అమెరికా మిత్రులను శక్తివంతం చేయడం, విదేశీ ప్రభుత్వాలను మార్చగల వారి సామర్థ్యాన్ని పెంచడం అని ఎన్.ఇ.డి. నిర్దేశకుల బోర్డ్ అధ్యక్షుడు కెన్నెత్ వోలాక్ ఒకసారి అమెరికా కాంగ్రెస్ కు చెప్పారు.

ఇరాన్ ప్రభుత్వ కూల్చివేతకు, ఇరాన్‌లో శాంతిభద్రతల భంగానికి, అశాంతి ప్రేరేపణకు మానవ హక్కుల ఉద్యమం ద్వారా ఎన్.ఇ.డి. చేసిన ప్రయత్నాలను ఇరాన్ మీడియా, "ఎన్.ఇ.డి. ట్రోజన్ హార్స్" గా పేర్కొంది. గ్రీకు పురాణగాథల్లో ప్రఖ్యాతి గాంచిన యుద్ధం ట్రోజన్ లో దాడులకు గురైన కంచు యుగపు నగరం ట్రాయ్‌లో ప్రవేశించడానికి గ్రీకులు దాచిపెట్టుకున్న బోలు కొయ్య గుర్రాన్ని గ్రీకు పురాణాల్లో ట్రోజన్ హార్స్ అంటారు. ఎన్.ఇ.డి. అమెరికా అనుకూల మీడియా సంస్థలకు మద్దతిచ్చింది. అరబ్ దేశాల్లో ప్రజాస్వామ్య కార్యకర్తల ముసుగులో అరబ్ దేశాల వ్యతిరేక శక్తులను ప్రోత్సహించింది. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛల కోసం పనిచేస్తున్నట్లు నటిస్తున్న రాజకీయ సమూహాలకు ఆర్థికసహాయం చేసింది. ఎన్.ఇ.డి. చాలా కాలంగా యూరప్‌లో చొరబడింది. యూరోపియన్ యూనియన్ అధికారులకు సహకరిస్తూ, యూరప్ స్వతంత్ర మీడియా సంస్థలకు ఆర్థిక సహాయంచేస్తూ, ప్రజల అభిప్రాయాన్ని అమెరికాకు అనుకూలంగా మలుచుకుంటున్నది.

ఎన్.ఇ.డి. చైనా అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకుంటోంది. తైవాన్ వేర్పాటువాద శక్తులకు మద్దతిస్తోంది. చైనా ప్రత్యేక పాలనా ప్రదేశం హాంకాంగ్‌లో చైనా వ్యతిరేక శక్తులతో కుమ్మక్కైంది. చైనా వ్యతిరేక సంస్థ 'వరల్డ్ ఉయ్ఘర్ కాంగ్రెస్' కు మద్దతిచ్చింది. చైనా స్వయంప్రతిపత్తి ప్రాంతం జిన్జియాంగ్ లోపల, వెలుపల ఉయ్ఘర్ ప్రజల సమిష్టి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నానని చెప్పుకునే బహిష్కృత ఉయ్ఘర్ సమూహాల అంతర్జాతీయ సంస్థ వరల్డ్ ఉయ్ఘర్ కాంగ్రెస్. ఇతర దేశాలను అస్థిరపర్చడానికి ఎన్.ఇ.డి. విభజన ఘర్షణలను ప్రేరేపించింది. టిబెట్ చైనాతో 23.5.1951 న 17 అంశాల ఒప్పందం కుదుర్చుకుంది. 24.10.1951 న 14 వ దలైలామా ఈ ఒప్పందాన్ని ఆమోదించారు. అయితే ఒత్తిడివల్ల ఆమోదించానని తర్వాత అన్నారు. టిబెట్ చైనా స్వయంప్రతిపత్తి ప్రాంతంగా, నైరుతి చైనా భాగంగా అంతర్జాతీయంగా గుర్తింపుపొందింది. ఎన్.ఇ.డి. అక్కడ 'టిబెట్ స్వాతంత్ర్యం' కార్యకలాపాలకు మద్దతునిస్తోంది.

ఎన్.ఇ.డి. వ్యూహాలను మారుస్తూనే ఉంది. శాంతి, అభివృద్ధి, ఉభయ విజయ సహకార చారిత్రక పోకడలకు వ్యతిరేకంగా మరింత ముందుకు సాగింది. దాని నిజ స్వభావం, అసంఖ్యాక దుశ్చర్యలను అమెరికా ప్రజలతో సహా ప్రపంచ సమాజం తీవ్రంగా ఖండించింది. అమెరికా అనుకూల విదేశీ రాజకీయ నాయకులు, పార్టీలకు మద్దతు ఇవ్వడానికి అమెరికాపన్ను చెల్లింపుదారుల డబ్బును చాలా వృధా చేసిందని, విదేశీ ఎన్నికల కార్యకలాపాలకు దొంగచాటుగా నిధులు సమకూర్చిందని, ఇటువంటి ఎన్నికల అవకతవకలను ప్రజాస్వామ్య ప్రోత్సాహంగా చిత్రీకరించిందని అమెరికా కాంగ్రెస్ పూర్వ సభ్యుడు రాన్ పాల్ అన్నారు. రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ 2015 లో ఎన్.ఇ.డి.ని అవాంఛనీయ సంస్థల జాబితాలో చేర్చింది. రష్యాలో దాని కార్యకలాపాలను నిషేధించింది. "ప్రతి దేశానికి తన జాతీయ వాస్తవాలకు, ప్రజల అవసరాలకు సరిపోయే అభివృద్ధి మార్గాన్ని అనుసరించే హక్కు ఉంది. అమెరికా ఎన్.ఇ.డి.ని విదేశీ జోక్య సాధనంగా ఉపయోగించే జుగుప్సాకర చర్యలను ప్రపంచ ప్రజలు నిరసిస్తున్నారు." అని సామాజిక శాస్త్రాల చైనా విద్యా సంస్థలో అమెరికా అధ్యయనాల సంస్థ సహచర పరిశోధకుడు వాంగ్ కాంగ్యూ అన్నారు.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి
చరవాణి: 9490 20 4545

క్రీస్తు జన్మస్థలంలో అంతరిస్తున్న క్రైస్తవం


డాక్టర్ దేవరాజు మహారాజు

ఒకప్పుడు ప్రపంచంపై క్రైస్తవాన్ని బలవంతంగా రుద్దిన ఇంగ్లాండ్‌లో ప్రస్తుతం తగ్గుముఖం పడుతూ ఉంది. ఒకప్పుడు అది పూర్తి క్రైస్తవ దేశం. ఇటీవలి కాలందాకా అక్కడ అరవైశాతం క్రైస్తవులు ఉండేవారు. ప్రస్తుతం అక్కడ నలభైఆరు శాతం మాత్రమే ఉన్నారు. ఏ మతాన్నీ పాటించని వారి సంఖ్య ఇంగ్లాండులో గణనీయంగా పెరుగుతూ ఉంది. ఇటీవలి కాలంలో 25.2 శాతం ఉన్న మానవవాదుల శాతం 37.2 కు పెరిగింది. మరో పదేళ్లలో ఈ శాతం ఇంకా పెరిగే అవకాశాలున్నాయని పరిశీలకులు అంటున్నారు. అదే నిజమైతే, ఇంగ్లాండులో క్రైస్తవులు మైనార్టీలో పడిపోయే అవకాశం ఉంది. ఇలా చెప్పుకోవాలంటే మరో తాజా ఉదాహరణ క్రీస్తు జన్మస్థలంలోనే క్రైస్తవం తగ్గుముఖం పడుతూ ఉంది.

రెండువేల సంవత్సరాల క్రితం బెత్లెహామ్‌లో ఏసుక్రీస్తు జన్మించాడనీ, అక్కడి నుంచే ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవం వ్యాపించిందనీ ఒక అభిప్రాయం ఉంది. అది కూడా చాలా బలంగా ఉంది. అయితే ఆ బెత్లెహామ్ ప్రస్తుతం ఇజ్రాయిల్‌లో కాకుండా పలస్తీనా ఆక్రమించిన ప్రాంతంలో ఉంది. అక్కడి ప్రధానమైన చర్చిల తాళాలు- రెండు ముస్లిం కుటుంబాల దగ్గర ఉంటాయి. ఉదయం వచ్చి తెరవడం, మళ్లీ రాత్రికి వచ్చి మూయడం వారే చేస్తారు. ఆ మధ్య కాలంలో అక్కడి ఆరు క్రైస్తవ వర్గాలు వంతులవారీగా తమ ఆధ్యాత్మిక సేవల్ని కొనసాగించుకుంటూ ఉంటాయి. ఇది ఇలా ఉంటే, అక్కడ మరో విచిత్రం కూడా జరుగుతూ ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు బెత్లెహామ్‌కు వచ్చి, ఏసు జన్మస్థలాన్ని దర్శించుకుని వెళ్లొచ్చు. వారికి వీసాలు సులభంగా దొరుకుతాయి-కూడా! కానీ, స్థానికంగా ఉన్న క్రైస్తవులకే అక్కడి ప్రధాన చర్చిలలోకి అనుమతిలేదు. అది పలస్తీనా ఆక్రమిత ప్రాంతం కాబట్టి, అక్కడ ఆ విషయంలో రాజకీయ కారణాలు పనిచేస్తూ ఉండొచ్చు- ఏసు నడయాడిన ప్రాంతం ఇజ్రాయిల్- పలస్తీనా వివాదాల్లో యుద్ధంలో నలుగుతూ ఉంది. ఇది జగద్విదితం!



బెత్లెహామ్‌లోని ఏసుక్రీస్తు జన్మస్థలమని భావిస్తున్న నేటివిటీ చర్చ్, జెరూసలేంలో ఏసును శిలువ వేశారని భావిస్తున్న చోట ఉన్న హోలీ సెపల్చర్ చర్చి- ఈ రెండూ క్రైస్తవుల ప్రధాన చర్చిలు. ఈ రెండు చర్చిల తాళాలే అక్కడి రెండు ముస్లిం కుటుంబాల ఆధీనంలో ఉన్నాయి. ఈ రెండు చర్చిల మధ్య ఉన్న 'స్టార్ స్ట్రీట్స్'(వీధు) లన్నీ వేల ఏళ్లక్రితం ఏర్పాటు చేసినవి. కాబట్టి, ఇప్పుడు అవి మరీ ఇరుకుగా, అసౌకర్యంగా అయ్యాయి. అమితమైన భక్తి శ్రద్ధలున్నవారు తప్ప, మామూలు వారు ఆ వీధుల్లో తిరగాలంటే ఇబ్బందిపడతారు. ఒక రకంగా ఇష్టపడరు. ఇవీ అక్కడి పరిస్థితులు. అయితే ఇప్పుడక్కడ క్రైస్తవానికి తీవ్రమైన విఘాతం కలిగింది. ఇజ్రాయిల్ ఏర్పడినప్పుడు అక్కడ క్రైస్తవుల జనాభా ఎనభైశాతంగా నమోదైంది. ఇప్పుడు అది పన్నెండు శాతానికి పడిపోయింది. ఏసు జన్మించాడని భావిస్తున్న చోటే క్రైస్తవం అంతరించిపోవడం ప్రపంచం ప్రత్యక్షంగా చూస్తూ ఉంది. అందుకు కారణాలు చాలా ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా మతాల పట్ల ప్రజల్లో ఏర్పడిన విముఖత. మతం నేపథ్యంలో వచ్చే ఒక ఫార్మాలటీగా, యథాలాపంగా జరుపుకోవడం. యువత మెరుగైన అవకాశాల కోసం యూరప్, మధ్య ప్రాచ్య దేశాలు, కెనడా వంటి దేశాలకు వలస వెళుతున్నారు. ఆక్రమణ, వలస, నిత్యం తనిఖీలతో స్థానికులు విసుగెత్తి పోతున్నారు. పై కారణాల ప్రభావం- అక్కడి జన జీవితం మీద ఒత్తిడి పెంచుతోంది. ఫలితంగా క్రైస్తవుల సంఖ్య తగ్గిపోవడంతో క్రైస్తవం గడ్డురోజుల్ని ఎదుర్కొంటోంది.

క్రిస్‌మస్ వచ్చిందంటే ప్రపంచవ్యాప్తంగా ప్రతి క్రైస్తవుడూ తన ఇంటి మీద ఒక నక్షత్రాన్ని (మోడల్) ప్రత్యేకంగా అలంకరించుకుంటాడు. రంగురంగులుగా అది వెలుగుతూ ఉండే విధంగా విద్యుత్ దీపాలు కూడా అలంకరించుకుంటాడు. కారణం ఏమంటే ఏసుక్రీస్తు జన్మించినపుడు ఆకాశంలో ఒక నక్షత్రం వెలిగిందనే దానికి అదే సంకేతం! అంతేకాదు, ఏసు తమ ఇంట్లోనే జన్మించాడని గర్వంగా ప్రకటించుకోవడానికి కూడా అది సంకేతం! ఆకాశంలో ఉండే నక్షత్రం తమకోసం ఏసుగా జన్మించాడని కూడా క్రైస్తవుల భావన! భావనలు సరేకానీ, ఏవైనా చారిత్రక ఆధారాలున్నాయా అంటే- లేవు. రోమన్, ఈజిప్టు, గ్రీక్, మెసపటోమియా మొదలైన ప్రాచీన నాగరికతల్లోని జానపద మత సాహిత్యంలో అద్భుత శక్తులను ప్రదర్శించే కల్పితపాత్రల పుట్టినరోజు సామాన్యంగా డిసెంబర్ 25 అనే ఉంది. దాన్ని దృష్టిలో ఉంచుకుని, అనేక చర్చోపచర్చలు, తర్జనభర్జనల అనంతరం క్రీస్తు- జీసస్ పుట్టిన రోజును కూడా డిసెంబర్ 25 నే నిర్ణయించారు. అదే క్రిస్‌మస్ అయ్యింది.

సాధారణ శకానికి ముందు పుట్టిన అరిస్టాటిల్, ప్లేటో వంటి వారి వివరాలు చరిత్రకు అందుతుండగా దేవుడి కుమారుడు, పాపుల రక్షకుడు అని భావించే ఏసుక్రీస్తు వివరాలు లభించకపోవడం విచిత్రంగా ఉంది. ఇక ఏసు చారిత్రక వ్యక్తి అని ప్రపంచానికి పరిచయం చేసినవాడు జోసెఫస్ అని చెపుతున్నారు. కానీ, నిజంగానే ఆయన ఏసును చారిత్రక వ్యక్తి అని అన్నాడా? అనుమానమే! ఎందుకంటే అందుకు ఆధారాలేలేవు. జోసెఫస్ మాత్రమేగాక, ఇంకా చాలామంది ఏసును చారిత్రక వ్యక్తి అని అన్నారని కొందరు బుకాయిస్తుంటారు. బుకాయింపు అని అన్నది ఎందుకంటే వారెవరూ తగిన ఆధారాలు చూపలేదు. పైగా వీరెవరూ ఏసుకు సమకాలీనులు కాదు, తర్వాత కాలంలో జీవించిన వారు. చాలామందికి తెలియని విషయమేమిటంటే- సాధారణ శకం 354 (సీఇ) దాకా 'క్రిస్టమస్' ఉనికిలో లేదు. అలాగే సాధారణ శకం 786 దాకా ప్రపంచ దేశాలలో ఎక్కడా క్రీస్తు పూర్వం/ క్రీస్తు శకం అనే సంక్షిప్త రూపాలు వాడుకలో లేవు. (వీటిని మనం ఇప్పుడు బీసీఈ/ సీఈ గా వాడుతున్నాం) అమెరికాలోని కొన్ని క్రైస్తవ శాఖల్లో క్రిస్టమస్ జరుపుకోవడంపై సా.శ.1836 కు ముందు నిషేధం ఉండేది. క్రిస్టమస్ జరుపుకోవడాన్ని తప్పుపట్టే క్రైస్తవ మత శాఖలు ఇప్పటికీ అక్కడక్కడా ఉన్నాయి. ఇలాంటి విషయాల గురించి ఎవరూ పెద్దగా మాట్లాడరు. క్రైస్తవులు కాని ఇతర మతస్థులు కూడా వేలంవెర్రిగా క్రిస్టమస్ జరుపుకుంటూ ఉంటారు. అయితే అది ఒక 'గెట్ టుగెదర్' గా సరదాగా గడపడం కోసం వినియోగిస్తారు. ఇంతా చేస్తే క్రైస్తవంలో మహోన్నతమైన గొప్పగొప్ప విషయాలు ఏమైనా ఉన్నాయా? లేవు. స్త్రీలను కించపరిచే విషయాలున్నాయి.

ఒక కోతి సూర్యుణ్ణి మింగిన థియరీలు మనకు ఉండొచ్చు- కన్యగా సూర్యుడితో గర్భం దాల్చిన కుంతి కథ మన వారసత్వ సంపద కావొచ్చు- కానీ, వర్జిన్ మేరీకి జీసెస్ పుట్టడంలోనే మనకు తర్కం కావాలి!- హాస్యంగా అనిపించినా ఇందులో నిజం ఉంది కదా? మతాలన్నీ ఒకే రకమైన కల్పనలతో పుట్టాయి. పెరిగాయి. అందువల్ల, ఏ మతమూ ఎక్కువా కాదు, ఏదీ తక్కువా కాదు. 'వెధవాయిని నేను అని ఒకడంటే, నీకంటే ఎక్కువ వెధవాయిన్నేను'- అని పోటీ పడుతున్నట్లుగా ఉంటాయి! మతాలన్నీ ఆధునికుడికి అర్థరహితమైనవి, పనికిరానివి. మతం ఆది మానవుడి భావన! సైన్స్ నేటి ఆధునిక మానవుడి ఆవిష్కరణ!!

సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త

బీహార్‌లో మళ్లీ కూలిన వంతెన

పాట్నా: బీహార్‌లోని గంగా నదిపై నిర్మిస్తున్న అగువానీ సుల్తాన్ గంజ్ వంతెనలోని ఒక భాగం కుప్పకూలింది. 11 ఏళ్లుగా నిర్మాణంలో ఉన్న వంతెన ఇలా కూలడం ఇది మూడోసారి. రూ.1710 కోట్లతో వంతెన నిర్మాణం సాగుతోంది. ఇదివరకు వంతెనలో కొంతభాగం జూన్ 5, 2023, ఏప్రిల్ 9, 2022న కూలిపోయింది. తాజాగా శనివారం ఉదయం కూడా వంతెన కూలిపోయింది. కూలిపోతున్న దృశ్యాలు అక్కడే ఉన్న కొందరు వీడియో తీసి పోస్టు పెట్టారు. అయితే వంతెన కూలినప్పుడు ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. బీహార్‌లో గత నాలుగు వారాల్లో 15 వంతెనలు కూలిపోయాయి. అరారియా జిల్లాలోని ఫోర్బ్స్‌గంజ్ బ్లాక్‌లోని అమ్హారా గ్రామం వద్ద పర్మాన్ నదిపై ఉన్న వంతెన కూడా భారీ వరదలకు ధ్వంసమైంది. రాష్ట్రంలో అనేకచోట్ల బ్రిడ్జి కూలిన ఘటనలపై సుప్రీం కోర్టు స్పందించింది. నిర్మాణంలో ఉన్న అన్ని వంతెనలను ఆడిట్ చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాది బ్రజేశ్ సింగ్ పిటిషన్ దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

సెబీ చైర్మన్ రాజీనామా చేయాల్సిందే: కాంగ్రెస్

న్యూఢిల్లీ: సెబీ చైర్‌పర్సన్ మాధవి బచ్ రాజీనామా చేయాలని, అదానీ కుంభకోణంపై జేపీసీతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మాధవి బచ్‌పై తాజా మీడియా కథనాన్ని ప్రస్తావిస్తూ ఆ పదవికి ఆమె సరిపోరని వ్యాఖ్యానించింది. బచ్ గురించి 'ది మార్నింగ్ కాంటెక్ట్' కథనాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో పంచుకున్నారు. ప్రైవేటు సంస్థ బ్లాక్‌స్టోన్‌కు వాటాలున్న కంపెనీల వ్యవహారాలన్నింటి నుంచి బచ్ తప్పుకోవడాన్ని ఆ కథనం ప్రముఖంగా పేర్కొనడాన్ని ప్రస్తావించారు. మరో రోజు... సెబీ చైర్‌పర్సన్ ప్రయోజనాలపై ... వివాదాలపై మరిన్ని వాస్తవాలంటూ ట్వీట్ చేశారు. మోదానీ మెగా కుంభకోణంలోని అన్ని కోణాల్లో పారదర్శక విచారణ జేపీసీతోనే సాధ్యమని జైరాం రమేశ్ పేర్కొన్నారు. అదానీ గ్రూపు చట్ట ఉల్లంఘనలపై సెబీ విచారణకు సుప్రీం ఇచ్చిన ఆదేశాలను సెబీ చైర్‌పర్సన్ ఇప్పటికే అపహాస్యం చేశారని దుయ్యబట్టారు. అదానీ వ్యవహారంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ జరపాల్సిందేనన్నారు.

లక్నో విమానాశ్రయంలో కలకలం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని లక్నో విమానాశ్రయంలో రేడియా ధార్మిక పదార్థాల గుర్తింపు కలకలం సృష్టించింది. చౌధరి చరణ్‌సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని టెర్మినల్-3 కార్గో ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం రొటీన్ తనిఖీల సమయంలో రేడియా ధార్మిక పదార్థాలను అధికారులు గుర్తించారు. పార్సిల్ స్కానింగ్ సమయంలో అలారం మోగడంతో అప్రమత్తమైన సిబ్బంది ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించారు. సమాచారం అందుకున్న నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ వెంటనే రంగంలోకి దిగింది.

ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం, గాయపడటం జరగలేదని, విమానాశ్రయ కార్యకలాపాలకు కూడా ఆటంకం కలగలేదని ఎయిర్‌పోర్ట్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఫ్లోరిన్ కంటైనింగ్ మెడిసన్ ప్యాకేజీ నుంచి ఈ లీకేజ్ జరిగిందని, దీన్ని అరికట్టి, భద్రతా పరమైన చర్యలు తీసుకున్నామని చెబుతున్నారు. ఫ్లోరిన్ లీకేజ్ వల్ల మంటలు చెలరేగడం, పేలుడు సంభవించడం, ఫ్లోరిన్ పీలిస్తే ప్రాణాలు కోల్పోవడం, ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. చర్మం, కళ్లు దెబ్బతినడంతో పాటు శ్వాససంబంధిత సమస్యలు ఎదురవుతాయి.

డబ్ల్యూఎఫ్ఐ మద్దతు లేదు

ఫొగాట్ భర్త సోమ్‌వీర్ రాఠీ

న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు భారత రెజ్లింగ్ సంఘం (డబ్ల్యూ ఎఫ్ఐ) నుంచి సరైన మద్దతు లేదని ఆమె భర్త సోమ్‌వీర్ రాఠీ ఆరోపించారు. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్‌లో అనర్హత వేటుకు గురైన వినేశ్‌కు ఫెడరేషన్ మద్ద తుగా నిలవలేదన్నారు. పారిస్ నుండి శనివారం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న వినేశ్ ఫొగాట్‌కు ఘన స్వాగతం లభించింది. పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చి వినేశ్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సోమ్‌వీర్ రాఠీ మీడియాతో మాట్లాడారు. వినేశ్ రిటైర్‌మెంట్‌ను వెనక్కి తీసుకుంటారా? అనే ప్రశ్నకు సోమ్‌వీర్ సమాధానం ఇవ్వలేదు. విమానాశ్రయంలో అభిమానుల నుంచి వచ్చిన అపూర్వ ప్రేమకు ధన్యవాదాలు తెలిపారు. దేశం మొత్తం వినేశ్‌పై అభిమానం కురిపిస్తోందన్నారు. ఆమెకు ఘనస్వాగతం లభించిందని, ఇలా చూడటం చాలా ఆనందంగా ఉందని అన్నారు. వినేశ్ సహచర రెజ్లర్లు పెద్ద ఎత్తున అండగా నిలిచారని చెప్పారు. తాము భారత్‌లోకి అడుగు పెట్టేవరకూ ఇలాంటి సంబరాలు ఊహించలేదని తెలిపారు. ఏం మాట్లాడాలో కూడా తెలియడం లేదన్నారు. పతకం కొద్దిదూరంలో చేజారిందని అన్నారు. తామంతా క్లిష్టసమయంలో ఉన్నామని, కాస్‌లో తీర్పు మనకు అనుకూలంగా రాలేదని చెప్పారు. ఇలాంటప్పుడు ఫెడరేషన్ తమకు మద్దతుగా లేదని ఆరోపించారు. అథ్లెట్లకు మద్దతుగా లేకపోతే నిర్భయంగా ఎలా ప్రదర్శన చేయగలరు' అని సోమ్‌వీర్ ప్రశ్నించారు.

బీజేపీ తమిళనాడు అధ్యక్షురాలిగా ఖుష్బూ?

చెన్నై: బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షురాలిగా ఆ పార్టీ జాతీయ కమిటీ సభ్యురాలు, ప్రముఖ సినీ నటి ఖుష్బూ నియమితులయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే అధిష్ఠానం ఓ నిర్ణయం తీసుకుందని, త్వరలోనే ప్రకటన వస్తుందని బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న అన్నామలై ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ రాజకీయ శాస్త్రాన్ని అభ్యసించేందుకు వచ్చే నెల లండన్ వెళ్తున్నారు. ఆరునెలలపాటు ఆయన అక్కడే ఉంటారు. ఇదే విషయమై అన్నామలై మాట్లాడుతూ... తాను లండన్ వెళ్లినా రాష్ట్ర అధ్యక్షపదవిలోనే కొనసాగుతానని, తన స్థానంలో కొత్తవారిని పార్టీ అధిష్ఠానం నియమించే ఆస్కారమే లేదని స్పష్టం చేశారు. అయితే ఆరు నెలలపాటు రాష్ట్రానికి దూరంగా ఉన్నా నాయకులతో తరచూ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ పార్టీ కార్యాకలాపాలను కొనసాగిస్తానని ప్రకటించారు. ఇదిలా ఉండగా... ఆయన్ను అధ్యక్ష పదవి నుంచి తొలగించాలంటూ కొందరు సీనియర్లు అధిష్ఠానాన్ని ఆశ్రయించారు.

గవర్నర్ల అనుమతితో గతంలో అరెస్టయిన సీఎంలు

న్యూఢిల్లీ: మైసూరు నగర అభివృద్ధి ప్రాధికార సంస్థ (ముడా) కుంభకోణంపై సీఎం సిద్ధరామయ్యను విచారించేందుకు కర్నాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాత్ ఆమోదం తెలపడం ఆ రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతోంది. గతంలో సీఎంలపై విచారణకు గవర్నర్ అనుమతిచ్చిన చాలా సందర్భాల్లో సీఎంలు అరెస్టయ్యారు. దాంతో ఇప్పుడు సిద్ధరామయ్య కూడా అరెస్ట్ అవుతారనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. విచారణకు గవర్నర్ అనుమతించడంతో గతంలో అరెస్టయిన సీఎంలలో లాలు ప్రసాద్ యాదవ్, బీఎస్ యడియూరప్ప, అరవింద్ కేజ్రీవాల్, మధుకొడా ఉన్నారు. దీంతో ఇప్పుడు సిద్ధరామయ్య కూడా అరెస్టు అవుతారనే ప్రచారం జరుగుతోంది.

1997లో దాణా కుంభకోణానికి పాల్పడినట్లు అప్పటి బీహార్ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌పై ఆరోపణలు వచ్చాయి. దాంతో విపక్షాలు తీవ్రంగా విమర్శలు చేశాయి. ఈ వ్యవహారం హైకోర్టుకు చేరడంతో సీబీఐ విచారణ చేయాలనే డిమాండ్ వినిపించింది. తీవ్ర గందరగోళం నెలకొన్న నేపథ్యంలో అప్పటి బీహార్ గవర్నర్ ఏఆర్ కిద్వాయ్... లాలూ యాదవ్‌పై కేసు నమోదు చేయడానికి అనుమతి ఇచ్చారు. అనంతరం సీబీఐ ఈ కేసు దర్యాప్తు ప్రారంభించింది. విచారణ తర్వాత సీబీఐ నాటి సీఎం లాలూను అరెస్టు చేసింది. దాంతో లాలూ తన భార్య రబ్రీదేవిని సీఎం కుర్చీపై కూర్చోబెట్టారు. 2011లో బీఎస్ యడియూరప్ప కర్నాటక ముఖ్యమంత్రిగా ఉన్నారు. అదే సమయంలో సంతోష్ హెగ్డే నేతృత్వంలోని లోకాయుక్త యడియూరప్పపై అవినీతి ఆరోపణలు చేసింది. ఆయన అక్రమంగా భూములు కేటాయించారని ఆరోపించింది. దాంతో అప్పటి కర్నాటక గవర్నర్ హన్సరాజ్ భరద్వాజ్... యడియూరప్పపై విచారణకు అనుమతి ఇచ్చారు. హన్స్‌రాజ్ తీసుకున్న ఈ నిర్ణయంపై అప్పట్లో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. లోకాయుక్త కోర్టు యడియూరప్పకు అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. 2011 అక్టోబర్‌లో యడియూరప్ప అరెస్టయ్యారు. దాంతో ముఖ్యమంత్రి పదవి వదులుకున్నారు. ఈ కేసులో యడియూరప్ప 23 రోజుల పాటు జైలులో ఉన్నారు. అనంతరం ఈ కేసును సీబీఐ తీసుకుంది. ఇక...2022లో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా కేజ్రీవాల్ ప్రభుత్వ మద్యం పాలసీపై దర్యాప్తును సీబీఐకి అప్పగించారు. ఈ కేసులో తొలుత అప్పటి ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను సీబీఐ విచారించింది. 2022 అక్టోబర్‌లో ఈడీతోపాటు సీబీఐ సిసోడియాను అరెస్టు చేశాయి.

సిసోడియాపై కేసు విచారణ జరుగుతుండగానే ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ నిందితుడిగా చేర్చింది. సుదీర్ఘ విచారణ తర్వాత 2024 మార్చిలో కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. అనంతరం సీబీఐ కూడా తీహార్ జైలు నుంచి కేజ్రీవాల్‌ను కస్టడీలోకి తీసుకుంది. అయితే కేజ్రీవాల్ మాత్రం సీఎం పదవికి రాజీనామా చేయలేదు.

2006లో కాంగ్రెస్, జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీల మద్దతుతో ఇండిపెండెంట్ ఎమ్మెల్యే మధు కోడా జార్ఖండ్ ముఖ్యమంత్రి అయ్యారు. కోడా ప్రభుత్వం రెండేళ్లు సజావుగా కొనసాగింది. ఆ తర్వాత సీఎం మధుకోడాపై మైనింగ్ కుంభకోణం ఆరోపణలు వచ్చాయి. బొగ్గు గనుల కేటాయింపులో దాదాపు రూ.400 కోట్ల అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. దాంతో అప్పటి గవర్నర్ సిబ్తే రిజ్వీ... మధుకోడాపై దర్యాప్తు కోసం సీబీఐకి లేఖ రాశారు. సీబీఐ దర్యాప్తు ప్రారంభించినప్పుడు మనీలాండరింగ్‌కు సంబంధించిన ఆధారాలు దొరికాయి. 2009లో కోడా కేసులో సీబీఐ, ఈడీ సంయుక్తంగా దర్యాప్తు ప్రారంభించాయి. విచారణలో కోడాను సీబీఐ అరెస్ట్ చేసింది. 2012 వరకు ఆయన జైలులోనే ఉన్నారు. ఈ కేసులో అతనికి 2017లో శిక్ష పడింది. ప్రస్తుతం మధు కోడా భార్య రాజకీయాల్లో ఉన్నారు. ముడా కుంభకోణంపై కర్నాటక సీఎం సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాత్ అనుమతి ఇచ్చారు.

దాంతో ఆయనపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. కాగా సిద్ధరామయ్యపై కుట్ర జరుగుతోందని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. సిద్ధరామయ్యను జైలుకు పంపడం ద్వారా ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం సీఎం సిద్ధరామయ్య న్యాయ సలహా తీసుకుంటున్నారు. మరోవైపు గవర్నర్ నిర్ణయాన్ని కర్నాటక ప్రభుత్వం కోర్టులో సవాల్ చేసే అవకాశం ఉంది.

వయనాడ్ బాధితుల కోసం ఐదు రోజుల జీతం విరాళం

తిరువనంతపురం: వయనాడ్ బాధితులకు కేరళలో ప్రభుత్వ ఉద్యోగులు ఐదు రోజుల జీతాన్ని విరాళంగా ఇవ్వనున్నారు. ఈ మొత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి వెళ్తుంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి... ఊళ్లు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆ విలయంలో సుమారు 300 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్కడ భారీ ఆస్తి నష్టం జరిగింది. వయనాడ్‌లో పునరావాస కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేశారు.

దాని కోసం ప్రభుత్వ ఉద్యోగుల నుంచి 5 రోజుల జీతాన్ని సేకరిస్తున్నారు. ఒకవేళ ఎక్కువ ఇవ్వాలనుకున్న ఉద్యోగులు కూడా తమ నిర్ణయాన్ని వెల్లడించవచ్చు. ఐదు రోజుల జీతాన్ని విరాళంగా ఇవ్వడానికి సుముఖంగా ఉన్నట్లు ఉద్యోగుల నుంచి అంగీకార లేఖ తీసుకోనున్నారు. మూడు ఇన్‌స్టాల్మెంట్లలో ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేస్తారు. ఒకవేళ ఎక్కువ ఇవ్వాలనుకుంటే 10 ఇన్‌స్టాల్మెంట్లలో జీతంలో కోత విధిస్తారు.

ఉగ్రవాదం, వేర్పాటువాదంతో తీవ్ర ముప్పు

ప్రధాని నరేంద్రమోదీ

న్యూఢిల్లీ: ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం సమాజాలకు తీవ్ర ముప్పుగా పరిణమించాయని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. దేశరాజధాని ఢిల్లీలో శనివారం జరిగిన వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్ సమ్మిట్ మూడవ ఎడిషన్‌లో మోదీ ప్రారంభోపన్యాసం చేశారు. వివిధ దేశాల నేతలతో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సమ్మిట్‌లో మోదీ మాట్లాడుతూ 'అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించేందుకు వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్ సమ్మిట్ వేదికగా మారింది' అని అన్నారు. ప్రపంచ అనిశ్చితి పర్యవసానాలు అభివృద్ధి చెందుతున్న దేశాలపై ప్రభావం చూపుతున్నాయని, ముఖ్యంగా ఆహారం, ఇంధన భద్రత రంగాలపై తీవ్రమైన ప్రభావం పడుతోందని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. 'చుట్టూ అనిశ్చితి వాతావరణం ఉన్న సమయంలో ఈరోజు మనం కలుస్తున్నాం. కోవిడ్ ప్రభావం నుంచి ప్రపంచం ఇంకా పూర్తిగా బయటపడలేదు. మరోవైపు యుద్ధ పరిస్థితి మన అభివృద్ధి ప్రయాణానికి సవాళ్లను సృష్టించింది. మనం వాతావరణ మార్పులకు సంబంధించిన సవాళ్లు మాత్రమే ఎదుర్కోవడం లేదు. ఇప్పుడు ఆరోగ్య, ఆహార, ఇంధన భద్రత గురించి కూడా మనకు సవాళ్లు ఉన్నాయి. వాటికి సంబంధించిన ఆందోళనలు ఉన్నాయి. గ్లోబల్ సౌత్ దేశాలకు ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం తీవ్రమైన ముప్పుగా ఉన్నాయి. ఐక్యతలోనే బలం ఉంది. ఈ ఐక్యతే గ్లోబల్ సౌత్ దేశాలు కొత్త దిశలో పయనించడానికి సహాయపడుతుంది. టెక్నాలజీ విభజన వల్ల సాంకేతికతకు సంబంధించిన కొత్త ఆర్థిక, సామాజిక సవాళ్లు పుట్టుకొస్తున్నాయి' అని మోదీ అన్నారు. గ్లోబల్ గవర్నెన్స్‌తో వ్యవహరించడానికి గత శతాబ్దంలో ఏర్పడిన సంస్థలు ప్రస్తుత శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొనలేకపోయాయని మోదీ పేర్కొనారు. ఇలాంటి తరుణంలో భారతదేశం నైపుణ్యం, అనుభవాలను గ్లోబల్ సౌత్‌లో పంచుకోవడానికి మోదీ సుముఖత వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల హరణే బీజేపీ ఉద్దేశం: ఖర్గే

న్యూఢిల్లీ: మోదీ పాలనలో ఎస్సీ, ఎస్టీ ఓబీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రాజ్యాంగం ఆ వర్గాలకు కల్పించిన రిజర్వేషన్ హక్కును హరించాలని బీజేపీ చూస్తోందని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను రిజర్వేషన్లకు దూరం పెట్టే విధంగా ఉద్యోగ నియామకాలను బీజేపీ చేపడుతోందని ఖర్గే ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయ నిబంధనల పూర్తి స్థాయి అమలు ఎంతో అవసరమని, అందుకోసమే కులగణన కోసం కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని ముక్కలు చేసి... రిజర్వేషన్‌పై రెండు విధాలుగా బీజేపీ దాడి చేస్తోందని ఖర్గే ఆరోపించారు. 'కేంద్రంలో సంయుక్త కార్యదర్శి, డైరెక్టర్లు, సహాయ కార్యదర్శుల 45 పోస్టుల భర్తీ కోసం మోదీ ప్రభుత్వం ప్రకటన వెలువరించింది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ఉందా? బీజేపీ వ్యూహాత్మకంగా ఈ తరహా నియామకాలను చేపడుతోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను రిజర్వేషన్లకు దూరం చేస్తోంది' అని ఖర్గే 'ఎక్స్'లో ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో 69 వేలమంది అసిస్టెంట్ టీచర్ల నియామకానికి సంబంధించిన 'రిజర్వేషన్ కుంభకోణం' హైకోర్టు నిర్ణయంతో బహిర్గతమైందని, రిజర్వేషన్ కుంభకోణంపై ప్రధాని మోదీకి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లేఖ రాశారని ఖర్గే తెలిపారు. మోదీ-యోగి పాలనలో ఇటువంటి నియామకాల ద్వారా దళితులు, వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ హక్కు హరించబడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాల రిజర్వేషన్‌లో అక్రమాల గురించి ప్రభుత్వం దృష్టికి బీజేపీ మిత్రపక్ష కేంద్రమంత్రి ఎందుకు తీసుకెళ్లారో తెలుసిందని ఖర్గే పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

నలుగురు జేజేపీ ఎమ్మెల్యేల రాజీనామా

చండీగఢ్: హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలకు నెల రోజుల ముందు దుష్యంత్ చౌతాలాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన నేతృత్వంలోని జననాయక్ జనతా పార్టీ (జేజేపీ)కి చెందిన 10 మంది ఎమ్మెల్యేలలో నలుగురు పార్టీని వీడారు. ఎమ్మెల్యేలు ఈశ్వర్ సింగ్, రామ్‌కరణ్ కాలా, దేవేంద్ర బబ్లీ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి శనివారం రాజీనామా చేశారు. మరో ఎమ్మెల్యే అనూప్ ధనక్ శుక్రవారం ఆ పార్టీని వీడారు. బీజేపీలో లేదా కాంగ్రెస్ పార్టీలో వీరు చేరవచ్చని తెలుస్తున్నది. కాగా, మరో ఇద్దరు జేజేపీ ఎమ్మెల్యేలు రామ్‌నివాస్ సుర్జాఖేరా, జోగి రామ్ సిహాగ్ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీజేపీకి అనుకూలంగా ప్రచారం చేశారు.

దీంతో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు వీరిపై అనర్హత వేటు వేయాలని జేజేపీ డిమాండ్ చేసింది. నార్నౌండ్‌కు చెందిన మరో ఎమ్మెల్యే రాంకుమార్ గౌరమ్ కొంతకాలంగా పార్టీని వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు మాజీ డిప్యూటీ సీఎం దుష్యంత్ చౌతాలా, ఆయన తల్లి నైనా చౌతాలా, అమర్‌జీత్ ధండా మాత్రమే ప్రస్తుతం ఆ పార్టీలో ఎమ్మెల్యేలుగా మిగిలి ఉన్నారు.

మమత రాజీనామా చేయాలి: నిర్భయ తల్లి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్న ఈ ఘటనపై నిర్భయ తల్లి ఆశాదేవి స్పందిస్తూ సీఎం మమతా బెనర్జీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఒక అమ్మాయికి అన్యాయం జరిగింది. ఆమెకు న్యాయం చేసేందుకు... దోషులపై చర్యలు తీసుకోవడానికి తన అధికారాన్ని ఉపయోగించవచ్చు. కానీ, సీఎం మమతా బెనర్జీ అలా చేయలేదు. అందుకు బదులు నిరసనలో పాల్గొన్నారు. సమస్య నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రయత్నిస్తున్నారు' అని ఆశాదేవి ఆరోపించారు. 'రాష్ట్ర అధినేత స్థానంలో ఉన్న ఆమె ఈ ఘటనకు కారణమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కానీ, పరిస్థితి ఎదుర్కోవడంలో విఫలమైనందుకు సీఎం పదవికి రాజీనామా చేయాలి. కోల్‌కతా మెడికల్ కళాశాలలో అమ్మాయిలకు రక్షణ లేదు. వారి పట్ల కొందరు రాక్షసులు క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. దేశంలో మహిళకు భద్రత ఏ స్థాయిలో ఉందో ఈ ఘటన ద్వారా అవగతం అవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని తీవ్రంగా పరిగణించాలి. జూనియర్ వైద్యురాలికి ఈ పరిస్థితి కల్పించిన దుర్మార్గులను కఠినంగా శిక్షించేంత వరకు ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆశ్రయం... జీవనోపాధి కోల్పోయిన

రైతులకు అండగా నిలుద్దాం

ప్రజలకు కేరళ సీఎం విజ్ఞప్తి



తిరువనంతపురం : ప్రకృతి వైపరీత్యాలలో తమ ఆశ్రయం, వ్యవసాయ భూములను కోల్పోయిన రైతులను ఆదుకోవాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రజలను కోరారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. శనివారం చింగం మలయాళ నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం, ఇటీవల వయనాడ్‌లో 200 మందికి పైగా ప్రాణాలను బలిగొన్న వినాశకరమైన కొండచరియలు విరిగిపడటంతో అనేక మంది రైతులు తమ జీవితాలను, జీవనోపాధిని, ఆశ్రయాన్ని కోల్పోయారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలు పవిత్రమైన రోజుగా భావించే చింగం... సమాజానికి రైతులు చేసిన సేవలను గుర్తించడానికి దక్షిణాది రాష్ట్రంలో రైతుల దినోత్సవంగా కూడా పాటిస్తారు. వయనాడ్‌లో ప్రకృతి వైపరీత్యం కలిగించిన విషాదకర ఘటనల నుంచి మనం ఇంకా బయటకు రాలేదని, కొండచరియలు విరిగిపడటంతో జీవనోపాధిని కోల్పోయిన బాధితులు, బంధువులు చాలా మంది ఉన్నారని ఆయన ఫేస్‌బుక్ పోస్ట్‌లో తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలలో గూడు, సాగు భూములు కోల్పోయిన రైతాంగాన్ని సమాజం ఆదుకోవాలని సీఎం అన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని పేర్కొన్న విజయన్... 'చింగం అందుకు అవకాశంగా మారనివ్వండి' అని అన్నారు. దేశంలో కేంద్రం అమలు చేస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు వ్యవసాయ వర్గాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని సీఎం విమర్శించారు. వ్యవసాయ రంగ కార్పొరేటీకరణను నిరోధించడానికి, కాలానికి అనుగుణంగా జనాదరణ పొందిన వ్యవసాయ పద్ధతులను అభివృద్ధి చేయడానికి మనం కలిసి నిలబడవలసిన అవసరాన్ని కూడా ఈ చింగం మనకు గుర్తుచేస్తుంది' అని ఆయన వివరించారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్రంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం విభిన్నమైన జోక్యాలను చేస్తోందని విజయన్ అన్నారు. అటువంటి జోక్యాలలో భాగంగా వ్యవసాయానికి సంబంధించిన సమాచారం, సేవలను అందించే 'కత్తిర్' మొబైల్ యాప్‌ను శనివారం ప్రారంభించినట్లు ఆయన ప్రకటించారు. వ్యవసాయాన్ని సకాలంలో మార్చడానికి ఇటువంటి జోక్యాలు సహాయపడతాయని సీఎం పేర్కొన్నారు.

ముస్లిం విద్యార్థి ఇల్లు కూల్చివేత

జైపూర్: తోటి విద్యార్థిని కత్తితో పొడిచిన ముస్లిం విద్యార్థి ఇంటిని అధికారులు కూల్చివేశారు. ఇంటి కూల్చివేతకు ముందు అక్కడ భారీగా పోలీసులను మోహరించారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఈ ఘటన జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు శుక్రవారం భోజన సమయంలో కొట్టుకున్నారు. ఆ సమయంలో హిందూ దళిత విద్యార్థిని ముస్లిం విద్యార్థి కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ఆ విద్యార్థిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో మత కలహాలకు దారి తీసింది. రెండు వర్గాలకు చెందిన వారు అల్లర్లకు పాల్పడ్డారు. కార్లకు నిప్పుపెట్టారు. కాగా, నిందితుడైన ముస్లిం విద్యార్థి, అతడి తండ్రిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారు నివసిస్తున్న అద్దె ఇల్లు అక్రమ నిర్మాణంగా ఉదయ్‌పూర్ జిల్లా యంత్రాంగం గుర్తించింది. ఈ నేపథ్యంలో శనివారం వారిని ఖాళీ చేయించిన తర్వాత జేసీబీలతో ఆ ఇంటిని కూల్చివేశారు. ప్రతిఘటించేందుకు ప్రయత్నించిన స్థానికులు, పోలీసుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది.

ఏక కాలంలో నిర్వహించరేం?

అసెంబ్లీ ఎన్నికలపై శరద్ పవార్



నాగపూర్ : ప్రధాని నరేంద్ర మోదీ 'ఒకే దేశం ఒకే ఎన్నికలు' అని ఒత్తిడి చేస్తున్నప్పటికీ రాబోయే రాష్ట్రాల ఎన్నికలను ఏకకాలంలో ఎందుకు నిర్వహించడం లేదని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్ శనివారం ప్రశ్నించారు. ఒక కార్యక్రమంలో భాగంగా నాగ్‌పూర్‌లో విలేకరులతో ఈ 82 ఏళ్ల రాజకీయ నాయకుడు మాట్లాడుతూ 'ప్రధాని మోదీ చెప్పేదానిలో నిజం లేదని' అని అన్నారు. ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో 'ఒక దేశం ఒకే ఎన్నికలు' అని ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం శుక్రవారం జమ్మూకశ్మీర్‌లో మూడు దశల్లో, హర్యానాలో సెప్టెంబరు-అక్టోబరులో ఒకే దశలో ఎన్నికలను ప్రకటించింది. 2019లో హర్యానాతో పాటు మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను జమ్మూకశ్మీర్ భద్రతా అవసరాల దృష్ట్యా తర్వాత ప్రకటిస్తామని పేర్కొంది. 'రెండు రాష్ట్రాల్లో (జమ్మూకశ్మీర్, హర్యానా) ఎన్నికల తేదీలను ప్రకటించారు. కానీ జార్ఖండ్, మహారాష్ట్రలో ఎన్నికలను ప్రకటించలేదు. అందుకే ఆయన (పీఎం మోదీ) చెప్పే దాంట్లో వాస్తవం లేదు' అని ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు అన్నారు. కాగా, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) మిత్రపక్షాలు శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ (ఎస్‌పీ) గతంలో ఎన్నికల షెడ్యూల్‌పై ఎన్నికల కమిషన్‌ను విమర్శించాయి. దాని నకిలీ వాగ్దానాలతో మహారాష్ట్ర ప్రజలను 'వెర్రి' వాళ్లను చేయడానికి బీజేపీ నేతృత్వంలోని మహాయుతికి మరింత సమయం కావాలని అనిపిస్తోందని అన్నారు. మహ్మద్ ప్రవక్త, ఇస్లాంకు వ్యతిరేకంగా హిందూ మత నాయకుడు రామగిరి మహారాజ్ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై నాసిక్, ఛత్రపతి శంభాజీనగర్‌లో ఉద్రిక్తత గురించి ఒక ప్రశ్నకు పవార్, ఇది సమాజానికి ప్రయోజనం కలిగించదని అన్నారు. 'ఈ రోజు శాంతి అవసరం ఉంది. సమాజం, రాజకీయ నాయకులు దాని గురించి ఓపికగా, జాగ్రత్తగా ఉండాలి' అని తెలిపారు. ప్రభుత్వం, హోం శాఖ బాధ్యతను చక్కబెట్టాలన్నారు. బంగ్లాదేశ్‌లో పాలన మార్పు గురించి, భారతదేశంలో కొన్ని చోట్ల దానిపై కొన్ని ప్రతిచర్యలు ఉన్నాయని శరద్ పవార్ అన్నారు. అయితే బంగ్లాదేశ్‌లో ఏమి జరిగిందనే దానిపై మహారాష్ట్ర నుంచి ప్రతి చర్యలు వస్తాయని తాము ఎప్పుడూ భావించడం లేదని చెప్పారు.

రక్షణ కల్పించాల్సిందే

- దేశవ్యాప్తంగా నినదించిన వైద్యులు, సిబ్బంది
- మౌన ప్రదర్శనలు... వినూత్న నిరసనలు
- నిలిచిపోయిన వైద్య సేవలు... శస్త్ర చికిత్సలు

కోల్‌కతా/న్యూఢిల్లీ/భువనేశ్వర్: కోల్‌కతాలో వైద్యురాలిపై దారుణ హత్యాచారానికి నిరసనగా దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య విద్యార్థులు పెద్ద సంఖ్యలో తమ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్వర్యంలోని ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు శనివారం 24 గంటల బంద్‌ను ప్రారంభించడంతో దేశంలోని ఆస్పత్రులు, క్లినిక్‌లు అత్యవసర కేసులను మినహా సాధారణ వైద్య సేవలను నిలిపివేశాయి. దేశమంతటా వైద్య సేవలను స్తంభింపజేసి, సమ్మెలో పది లక్షల మందికి పైగా వైద్యులు పాల్గొన్నారని అంచనా. అత్యవసర కేసుల కోసం వైద్య కళాశాలల అధ్యాపక సిబ్బందిని సేవల్లోకి తెచ్చినట్లు ఆస్పత్రులు తెలిపాయి. వైద్య సంఘాల ప్రతినిధులతో సమావేశం అనంతరం కేంద్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ప్రకటనలో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వైద్యులు తిరిగి విధుల్లో చేరాలని కోరింది. ఐఎంఏ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, ఉదయం 6 గంటలకు ప్రారంభమైన సమ్మె ఎంపిక చేసిన వైద్య సేవలను, ఔట్ పేషెంట్ విభాగాలను నిలిపివేసింది. 'జూనియర్ వైద్యులు అందరూ సమ్మెలో ఉన్నారు. అందువల్ల 90 శాతం మంది వైద్యులు సమ్మెలో ఉన్నారని దీని అర్థం' అని దక్షిణాది రాష్ట్రమైన తెలంగాణలోని ఐఎంఏ ప్రతినిధి సంజీవ్ సింగ్ యాదవ్ రాయిటర్స్ వార్తా సంస్థకు తెలిపారు. ఏఎన్ఐ వార్తా సంస్థ ప్రకారం, నేరం జరిగిన ఆర్‌జీ కర్ వైద్య కళాశాల వెలుపల ఆస్పత్రి ప్రాంగణం నిర్మానుష్యంగా ఉండగా, శనివారం భారీ పోలీసు బందోబస్తు కనిపించింది. కోల్‌కతాలో పెద్ద సంఖ్యలో ప్రైవేట్ క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాలను మూసివేశారు. నగరంలోని ప్రైవేట్ శిశు వైద్యుడు డాక్టర్ సందీప్ సాహా రాయిటర్స్‌తో మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో తప్ప సాధారణ వైద్య సేవలకు హాజరు కానని చెప్పారు. ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచార ఘటనపై న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వైద్యులు తమ జూనియర్ వైద్యులతో కలిసి వైద్య సేవల బంద్‌లో పాల్గొన్నారు. దీంతో పశ్చిమ బెంగాల్ అంతటా వైద్య సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వ అధ్వర్యంలో నడిచే ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రి, శంభునాథ్ పండిట్ ఆస్పత్రి, కలకత్తా జాతీయ వైద్య కళాశాల ఆస్పత్రిలో, రాష్ట్రంలోని ప్రైవేట్ వైద్యశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆస్పత్రుల్లో భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ పంజాబ్, హర్యానాలో వైద్యులు నిరసనలు చేపట్టారు. అమృత్‌సర్, లూథియానాలో అనేక చోట్ల ధర్నాలు నిర్వహించారు. జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో వైద్యులు నిరసనల్లో పాల్గొన్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్, అసోంలోని గువహటి, తమిళనాడులోని చెన్నై, గోవా, కాన్పూర్, ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో, ఆంధ్ర ప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్టణం, ఇతర నగరాల్లోని ఆస్పత్రులు, క్లినిక్‌లు సమ్మెలో చేరాయి. దేశ రాజధాని ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) లో అడ్మిషన్లు, ఆపరేషన్ థియేటర్లు, రేడియోలాజికల్ పరిశోధనలు 90 శాతం కంటే ఎక్కువ తగ్గింపు సేవలను నమోదు చేశాయి. నాగాలాండ్ రాష్ట్రమంతటా ఆరోగ్య సంరక్షణ సేవలు దెబ్బతిన్నాయి. ఐఎంఏ నాగాలాండ్ రాష్ట్ర శాఖ (ఐఎంఏఎన్‌సీబీ), నాగాలాండ్ ఇన్-సర్వీస్ డాక్టర్స్ అసోసియేషన్ (ఎన్ఐడీఏ), ఇండియన్ డెంటల్ అసోసియేషన్ నాగాలాండ్ రాష్ట్ర శాఖ (ఐడీఏఎన్ఎస్‌బీ) అత్యవసర సేవలు మినహా అన్ని సేవలను ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిలిపివేసింది. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి వందలాది మంది వైద్యులు నిరసనలో పాల్గొన్నారు. సిలిగురి జిల్లా ఆస్పత్రిలో సేవలను ప్రభావితం చేయడంతో రోగులు సమస్యలు ఎదుర్కొన్నారు. కేరళ రాజధాని తిరువనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల, ఎర్నాకులం జిల్లాలో వైద్యులు, అలాగే బీహార్ రాజధాని పాట్నాలోని ఎయిమ్స్ వైద్యులు నిరసనలో పాల్గొన్నారు. గోవాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యులు ఉదయం 6 గంటల నుంచి పనిని నిలిపివేశారు. ఆజాద్ మైదాన్ నుంచి ఓల్డ్ గోవా వైద్య కళాశాల ఆస్పత్రి భవనం వరకు ఐఎంఏ సభ్యులు మౌన నిరసన ప్రదర్శన నిర్వహించారు. అసోం అంతటా వైద్య సేవలు నిలిచిపోయాయి. దిబ్రూగఢ్‌లోని అస్సాం వైద్య కళాశాల ఆస్పత్రి (ఏఎంసీహెచ్) వైద్యులు నిరసన చేపట్టారు. మణిపూర్‌లో రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్), జవహర్‌లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (జేఎన్ఐఎంఎస్) తో సహా అన్ని ఆస్పత్రుల్లో ఔట్ పేషెంట్ విభాగాలు మూతపడ్డాయి. ఒడిశా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 6 వేల మంది ఐఎంఏ సభ్యులు నిరసనలో పాల్గొన్నారు. ఉత్తర ప్రదేశ్‌లో ఐఎంఏతో సంబంధం ఉన్న ప్రైవేట్ క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌లను నడుపుతున్న వైద్యులు బంద్‌లో పాల్గొన్నారు. లక్నోలో జూనియర్ డాక్టర్లు తమ చేతులకు నల్ల బ్యాండ్‌లు కట్టుకుని 'కళా రక్షాబంధన్'ని పాటించారు. మహారాష్ట్రలోని ప్రైవేట్ వైద్యులు ఆందోళనలో చేరడంతో ఓపీడీ విభాగాలు, ఇతర సాధారణ సేవలు నిలిచిపోయాయి. హిమాచల్ ప్రదేశ్ మెడికల్ డాక్టర్స్ అసోసియేషన్ బంద్‌కు సంఘీభావం తెలిపింది. అరుణాచల్ ప్రదేశ్‌లో కూడా వైద్యులు సమ్మెలో పాల్గొన్నారు. నహర్లగన్‌లోని టోమో రిబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ మెడికల్ సైన్సెస్ వైద్యులు నిరసన చేపట్టారు. బాధితురాలికి, ఆమె కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని వైద్యులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.

ప్రధాని జోక్యం చేసుకోవాలి : ఐఎంఏ

కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం కేసులో ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.వి.అశోకన్ శనివారం కోరారు. ప్రధాని జోక్యం చేసుకునేందుకు 'సమయం ఆసన్న మైందని' అన్నారు. 'ఈ దేశంలో మా వృత్తిలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. వారికి భద్రత కల్పించాలని మేము అనేక సార్లు కోరడం జరిగింది' అని అశోకన్ అన్నారు. కోల్‌కతాలో 'అనాగరిక' నేరంపై వేగవంతమైన విచారణ, హింస నుంచి ఆరోగ్య సంరక్షణ సిబ్బందిని మెరుగ్గా రక్షించడానికి మరిన్ని చట్టపరమైన చర్యలకు ఐఎంఏ పిలుపునిచ్చింది. 2002లో పశ్చిమ రాష్ట్రమైన గుజరాత్‌ను చుట్టుముట్టిన మతపరమైన అల్లర్ల సమయంలో సామూహిక అత్యాచారానికి గురైన ముస్లిం మహిళకు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ క్రిమినల్ లాయర్ శోభా గుప్తా మాట్లాడుతూ 'శిక్ష సాధ్యమైనంత కఠినంగా ఉండాలి. వేగంగా రావాలి' అని అన్నారు.

రోగులకు ఇబ్బందులు

ఆసుపత్రుల వద్ద రోగులు బారులు తీరారు. వైద్యులు నిరసనలు చేపట్టడం వల్ల తమకు వైద్యసేవలు అందడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను ఇక్కడికి రావడానికి ప్రయాణానికి 500 రూపాయలు ఖర్చు చేశాను. నాకు పక్షవాతం, నా పాదాలు, తల, నా శరీరంలోని ఇతర భాగాలలో మంటలు ఉన్నాయి' అని ఒడిశాలోని కటక్ నగరంలోని ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రి వద్ద ఒక రోగి స్థానిక టెలివిజన్‌తో అన్నారు. 'సమ్మె గురించి మాకు తెలియదు. మేము ఏమి చేయగలం. ఇంటికి తిరిగి వెళ్లడమే' అని అన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలకు 50 వేల విరాళం

అందజేసిన విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

విశాలాంధ్ర-విజయవాడ: సెప్టెంబరు 1,2,3, తేదీలలో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లోని గురజాడ కళాక్షేత్రంలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలు జయప్రదాన్ని కాంక్షిస్తూ ఏపీ విద్యుత్ కాంట్రాక్ట వర్కర్స్ యూనియన్ నాయకత్వం రూ.50 వేల విరాళం అందజేశారు. యూనియన్ నాయకులు స్థానిక ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసుకు 50 వేల రూపాయల విరాళం అందించారు. యూనియన్ నాయకులు ఎం.బాలకాశి, దండి మణిపాల్ ఈ మొత్తం విరాళాన్ని కార్మికుల నుండి సేకరించి రాష్ట్ర సమితికి అందించారు.

పిచ్చయ్యకు 'ప్రజా గాయకుడు' బిరుదు

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్యకు రాష్ట్ర ప్రభుత్వం 'ప్రజాగాయకుడు బిరుదు' ప్రదానం చేసింది. దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌ను 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన చేతుల మీదుగా పిచ్చయ్య అందుకున్నారు. ప్రజాగాయకుడు బిరుదు అందుకున్న పిచ్చయ్యకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సహా అనేకమంది శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన సంప్రదాయంలో సుప్రీం జడ్జి వివాహం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: అరకు అందాలు అద్భుతంగా ఉన్నాయని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జేకే మహేశ్వరి కొనియాడారు. జస్టిస్ దంపతులు శనివారం అరకులోయలో పర్యటించారు. రైలులో అరకు చేరుకున్న జస్టిస్ దంపతులకు అల్లూరి సీతారామరాజు జిల్లా సంయుక్త కలెక్టర్ డా.ఎంజే అభిషేక్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఘన స్వాగతం పలికారు. ముందుగా రైల్వే అతిథి గృహానికి చేరుకున్న జస్టిస్ దంపతులు గిరిజన మ్యూజియాన్ని సందర్శించారు. అక్కడ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను తిలకించి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం పెదలబుడు పంచాయతీలోని గిరి గ్రామదర్శినిని సందర్శించారు. అక్కడ గిరిజన వస్త్రధారణతో జస్టిస్ దంపతులు గిరిజన సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఆలపాటి గిరిధర్, పోక్సో కోర్టు జడ్జి జి.ఆనంది, జిల్లా అడిషనల్ జడ్జి పి.గోవర్ధన్, గాజువాక సీనియర్ సివిల్ జడ్జి ఈ.రాజేంద్రబాబు, రెండవ అదనపు సివిల్ జడ్జి డి.సోని, రైల్వే కోర్టు మెజిస్ట్రేట్ కె.అనురాగ్, మూడవ అదనపు సివిల్ జడ్జి జి.కార్తీక్, అనకాపల్లి ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి ఎ.రమేశ్ చోడవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి. స్వర్ణ, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఏఎస్పీ ధీరజ్, డీఆర్ఓ బి.పద్మావతి, అరకు తహసీల్దార్ వేణుగోపాల్, టూరిజం జిల్లా అధికారి దాసు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ నేత వేణుగోపాల్

న్యూఢిల్లీ: ప్రభుత్వ వ్యయాలపై నిఘా ఉంచే పార్లమెంటు ప్రజా ఖాతాల కమిటీ (పీఏసీ) కి కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ నేతృత్వం వహిస్తారని లోక్‌సభ సచివాలయ వర్గాలు తెలిపాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నాలుగు ఇతర పార్లమెంటరీ ప్యానెల్‌లను కూడా ఏర్పాటు చేశారు. వీటిలో అంచనాలు, పబ్లిక్ అండర్‌టేకింగ్‌ల కమిటీలు కూడా ఉన్నాయి. వీటికి బీజేపీ నాయకులు అధ్యక్షత వహిస్తారు. పబ్లిక్ అకౌంట్స్, పబ్లిక్ అండర్‌టేకింగ్‌లు, అంచనాల కమిటీలు ప్రభుత్వ ఖాతాలు, ప్రభుత్వ రంగ సంస్థల పనితీరుపై నిఘా ఉంచే బాధ్యత కలిగిన పార్లమెంటుకు చెందిన కీలక ఆర్థిక కమిటీలు. పార్లమెంటరీ కమిటీల రాజ్యాంగాన్ని ప్రకటిస్తూ లోక్‌సభ సచివాలయం శుక్రవారం బులెటిన్‌ను విడుదల చేసింది. ఓబీసీల సంక్షేమ కమిటీకి బీజేపీకి చెందిన గణేష్ సింగ్ నేతృత్వం వహిస్తారు. ఆయన పార్టీ సహచరుడు ఫగ్గన్ సింగ్ కులస్తే ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీకి నేతృత్వం వహిస్తారు. బీజేపీ నేత సంజయ్ జైస్వాల్ అంచనాల కమిటీకి నేతృత్వం వహిస్తుండగా, ఆయన పార్టీ సహచరుడు బైజయంత్ పాండా పబ్లిక్ అండర్‌టేకింగ్‌ల కమిటీకి అధ్యక్షత వహిస్తారు. లోక్‌సభ, రాజ్యసభ రెండింటి నుంచి సభ్యులను కలిగి ఉండే ఈ కమిటీల పదవీకాలం ఒక సంవత్సరం. వారు రెండు సభల ద్వారా ఎన్నికవుతారు. పీఏసీ సాధారణంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన సీనియర్ లోక్‌సభ సభ్యుడు నేతృత్వంలో ఉంటుంది. కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి ఐదేళ్లపాటు పీఏసీకి నేతృత్వం వహించారు. గత లోక్‌సభ మాదిరిగా కాకుండా 18వ లోక్‌సభలో కమిటీలు ఎన్నికలకు బదులుగా ఏకాభిప్రాయం ద్వారానే రూపుదిద్దుకున్నాయి. పీఏసీతో పాటు పబ్లిక్ అండర్‌టేకింగ్‌ల కమిటీ, అంచనాల కమిటీ, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమంపై కమిటీ, లాభార్జన కార్యాలయంపై జాయింట్ కమిటీ, ఇతర వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీలను ఈసారి ఎన్నికలు లేకుండానే ఏర్పాటు చేశారు. లోక్‌సభ స్పీకర్ వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల పనితీరుపై నిఘా ఉంచే శాఖ సంబంధిత స్టాండింగ్ కమిటీలను ఇంకా ఏర్పాటు చేయలేదు.

ఫలించని మోదీ జుమ్లా రాజకీయం

- పాలనా విధానాలకు తప్పని ప్రజా తిరస్కారం: నారాయణ, అమర్‌జిత్ కౌర్
- అధిక ధరలకు నిరసనగా 1-7 తేదీల్లో ఢిల్లీవ్యాప్తంగా ఆందోళనలు

న్యూఢిల్లీ: జుమ్లా రాజకీయాలు పనిచేయవని దేశ ప్రజలు ఇప్పటికే ప్రధాని మోదీకి స్పష్టంచేశారని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, అమర్‌జిత్ కౌర్ అన్నారు. గుత్తేదారుల ప్రయోజనాలే లక్ష్యంగా దేశాన్ని, దేశ ప్రజల ప్రయోజనాలను మోదీ ప్రభుత్వం పణంగా పెట్టేస్తోందని, ఇందుకు కేంద్రప్రభుత్వ తాజా బడ్జెటే నిదర్శనమన్నారు. సీపీఐ ఢిల్లీ సమితి అధ్వర్యంలో పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లోని ఘటే హాల్‌లో జరిగిన సమావేశాలకు జాతీయ సమితి సభ్యుడు శంకర్‌లాల్ అధ్యక్షత వహించారు. అధిక ధరలకు వ్యతిరేకంగా సెప్టెంబరు 1 నుంచి 7వ తేదీ వరకు ఢిల్లీ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. సెబీ చైర్‌పర్సన్‌ను విధుల్లో నుంచి తొలగించి, సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాలని, కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన ప్రధాన నేరస్తుడిని ఉరితీయాలని, మిగతా నేరస్తులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విడుదల చేయాలని, ఇజ్రాయిల్‌ను యుద్ధ నేరదేశంగా ప్రకటించాలని, పలస్తీనాలో ఆక్రమించుకున్న అన్ని ప్రాంతాలను ఇజ్రాయిల్ ఖాళీ చేయాలని, పలస్తీనాలో తక్షణమే కాల్పులను విరమించాలని డిమాండ్లతో తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. 100 మందికిపైగా పార్టీ నాయకులు, విద్యార్థులు, యువత, మహిళలు, కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, కార్మిక వర్గం, విద్యార్థులు, యువత, మహిళలు, బ్యాంకు ఉద్యోగుల్లో పార్టీ విస్తరణ వంటి అంశాలపై చర్చించారు. తొలుత నారాయణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సామాన్యులు అధిక పన్నులు చెల్లిస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇంతలా ధరలు పెరిగిన దాఖలాలు లేవని అన్నారు. దేశంలో నిరుద్యోగాన్ని తారస్థాయికి చేర్చిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందని వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వానికి మతగురువులుగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఉన్నాయని అన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలకు పావులుగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్ మారడం దురదృష్టకరమని నారాయణ అన్నారు. అనంతరం అమర్‌జిత్ కౌర్ పార్టీ జాతీయ సమితి రాజకీయ నివేదికను ప్రవేశపెట్టారు. 1925లో సీపీఐ పురుడుపోసుకోగా అదే సంవత్సరం ఆర్ఎస్ఎస్ కూడా ఏర్పాటైందని కౌర్ గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరంలో సీపీఐ అగ్రభాగన నిలబడి పోరాడితే భారత్‌కు స్వాతంత్ర్యం గురించే ఆర్ఎస్ఎస్ మాట్లాడలేదన్నారు. దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీయడమే కాకుండా కార్మికులు, యువత, విద్యార్థులు, మొత్తంగా ప్రజా వ్యతిరేక విధానాలు తీసుకొచ్చారని మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రజా వ్యతిరేక కొత్త భారతీయ న్యాయ కోడ్‌ను తిప్పికొట్టాలని అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నదని అన్నారు. హిండెన్‌బర్గ్ తాజా నివేదిక ప్రకారం గౌతం అదానీ రూ.32000 కోట్ల మోసం చేయగా, ఆయనను ప్రధాని వెనకేసుకొస్తున్నారని అమర్‌జిత్ కౌర్ విమర్శించారు. సమావేశం చివరిలో సీపీఐ ఢిల్లీ సమితి కార్యదర్శి, జాతీయ సమితి సభ్యులు ప్రొఫెసర్ దినేశ్ వార్ష్నే మాట్లాడుతూ సమజంలోని అన్ని వర్గాల్లో పార్టీ విస్తరణ కోసం నారాయణ, అమర్‌జిత్ కౌర్ ఇచ్చిన అన్ని సలహాలు, సూచనలను తప్పకుండా ఆచరిస్తామని అన్నారు. సీపీఐ పిలుపునిచ్చే ప్రతి ఒక్క పోరాటం ఢిల్లీ శాఖ క్రియాశీలంగా వ్యవహరించిందని తెలిపారు.

బంగ్లాదేశ్ హింసలో 650 మంది మృతి: ఐరాస

జెనీవా: ఉద్యోగాల్లో కోటాకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు, అల్లర్లతో బంగ్లాదేశ్ అల్లకల్లోలమైంది. ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో వందల్లో మరణాలు సంభవించాయి. జులై 16 నుంచి ఆగస్టు 11 వరకు సాగిన హింసలో దాదాపు 650 మంది చనిపోయినట్లు ఐక్యరాజ్య సమితి (ఐరాస) మానవహక్కుల కార్యాలయం నివేదిక తెలిపింది. నిష్పాక్షిక, పారదర్శ కత విచారణ ద్వారా ఈ మేరకు నిర్ధారణకు వచ్చినట్లు తెలిపింది. ఎక్స్‌ట్రా జ్యుడిషియల్ హత్యలు, అరెస్టులు, నిర్బంధనాలను ప్రస్తావించింది. 'బంగ్లాదేశ్‌లో తాజా అల్లర్లపై ప్రాథమిక విశ్లేషణ' పేరిట 10 పేజీల నివేదికను విడుదలచేసింది. జులై 16 నుంచి ఆగస్టు 4 వరకు 400 మంది ప్రాణాలు కోల్పోయగా, ఆగస్టు 5,6 తేదీల్లో జరిగిన హింసలో మరో 250 మంది చనిపోయినట్లు నివేదిక పేర్కొంది. ఈ పరిణామాలతో ప్రధాని షేక్ హసీనా గద్దె దిగడమే కాకుండా దేశాన్ని వీడటం విదితమే. హింసలో గాయపడి చికిత్స పొందుతూ చనిపోయిన వారితో సహా ఈనెల 7-11 తేదీల్లో మరణాలు ఎక్కు వగా నమోదయ్యాయని యూఎన్‌హెచ్ ఆర్‌సీ నివేదిక పేర్కొంది. మృతుల్లో నిరసనకారులు, జర్నలిస్టులు, భద్రతా సిబ్బంది ఉన్నట్లు తెలిపింది. వేలాది మంది నిరసనకారులు గాయపడ్డారని, రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడాయని వెల్లడించింది. ఈనెల 15న కూడా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నట్లు ఐరాస నివేదిక పేర్కొంది.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.